# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com


## ఆ ట్రాఫిక్ కానిస్టేబుల్‌కు హ్యాట్సాఫ్..

హైదరాబాద్, ఆగస్టు 27: రాజేంద్ర నగర్ పోలీసు స్టేషన్‌కు సమీపంలో ఉన్న సిగ్నల్స్ వద్ద రోడ్డుపై కంకర రాళ్లు పడిపోయాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. బైక్‌లు స్కిడ్ అవుతున్నాయి. అక్కడే విధుల్లో ఉన్న ఓ ట్రాఫిక్ కానిస్టేబుల్ గమనించాడు. క్షణం కూడా ఆలోచించకుండా.. రోడ్డుపై పడి ఉన్న కంకర రాళ్లను ట్రాఫిక్ కానిస్టేబుల్ పక్కకు ఊడ్చేశాడు. వాహనదారుల సురక్షిత ప్రయాణం కోసం శ్రమించిన ట్రాఫిక్ కానిస్టేబుల్‌పై నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు.


హైదరాబాద్ ఆదివారం 28-8-2022 RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :29 సంచిక: 22 పేజీలు:6 వెల: రూ.1/-


## జస్టిస్ ఎన్వీ రమణను కలిసిన మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ



హైదరాబాద్, ఆగస్టు 27: సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ ఎన్వీ రమణను శనివారం ఆయన నివాసంలో తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ, ఆందోల్ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్, జర్నలిస్టు సంఘాల నాయకులు కలుసుకున్నారు. జస్టిస్ రమణకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఆయనను శాలువాతో సత్కరించారు. సుప్రీంకోర్టులో రెండురోజుల క్రితం తెలంగాణ జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల కేటాయింపులో సానుకూల తీర్పు ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

అల్లం నారాయణతోపాటు జర్నలిస్టు సంఘాల నాయకులను జస్టిస్ ఎన్వీ రమణ వివిధ విషయాలు అడిగి తెలుసుకున్నారు. 'కొలిమి అంటుకున్నది' అనే పుస్తకం గురించి ప్రస్తావించారు. జస్టిస్ ఎన్వీ రమణను కలిసినవారిలో టీయూడబ్ల్యూజే ప్రధాన కార్యదర్శి మారుతీసాగర్, ఢిల్లీ టీయూడబ్ల్యూజే కార్యవర్గ సభ్యులు, తదితరులున్నారు.

## సీజేఐగా జస్టిస్ యూయూ లలిత్ ప్రమాణ స్వీకారం



న్యూఢిల్లీ, ఆగస్టు 27: సుప్రీంకోర్టు 49వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ ఉదయ్ ఉమేశ్ లలిత్ ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము.. జస్టిల్ లలిత్‌తో ప్రమాణం చేయించారు. ఈ ఏడాది నవంబర్ 8 వరకు ఆయన సీజేఐగా కొనసాగనున్నారు. రాష్ట్రపతి భవన్‌లో జరిగిన ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ప్రధాని మోదీ, ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్కర్, కేంద్ర మంత్రులు, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, జస్టిస్ ఎన్వీ రమణ, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు హాజరయ్యారు.

జస్టిస్ యూయూ లలిత్ 1957 నవంబరు 9న జన్మించారు. 1983 జూన్‌లో న్యాయవాద వృత్తిలోకి ప్రవేశించారు. 1985 డిసెంబర్ వరకు బాంబే హైకోర్టులో ప్రాక్టీసు చేశారు. 1986 నుంచి సుప్రీంకోర్టులో న్యాయవాదిగా కొనసాగుతున్నారు. 2014 ఆగస్టు 13న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. త్రిపుల్ తలాక్ సహా, అనేక కీలక కేసుల తీర్పుల్లోనూ జస్టిస్ లలిత్ భాగస్వామిగా ఉన్నారు.

## మహిళా, శిశు సంక్షేమ శాఖలో 181 ఉద్యోగాలకు నోటిఫికేషన్

హైదరాబాద్, ఆగస్టు 27: తెలంగాణలో కొలువుల జాతర కొనసాగుతూనే ఉంది. ఇప్పటికే గ్రూప్ -1, ఎస్ఐ, పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాలతో పాటు పలు ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు విడుదల చేయగా, తాజాగా మరో నోటిఫికేషన్ విడుదలైంది. మహిళా, శిశు సంక్షేమ శాఖలో 181 ఉద్యోగాల భర్తీకి టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. గ్రేడ్ -1 ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్(సూపర్ వైజర్) పోస్టుల భర్తీ చేపట్టనున్నట్లు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. అర్హులైన మహిళ అభ్యర్థుల నుంచి సెప్టెంబర్ 8 నుంచి 29వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించనున్నారు. తదితర వివరాల కోసం అనే వెబ్‌సైట్‌ను లాగిన్ అవొచ్చు

## కేయూలో టీఎస్ ఐసెట్-2022 ఫలితాలు విడుదల

హైదరాబాద్, ఆగస్టు 27: టీఎస్ ఐసెట్ -2022 ఫలితాలు విడుదలయ్యాయి. 2022-23 విద్యా సంవత్సరానికి ఎంబీఏ, ఎంసీఏలో ప్రవేశాల నిమిత్తం జూలై 27, 28వ తేదీల్లో నిర్వహించిన టీఎస్ ఐసెట్ -2022 ఫలితాలను ఐసెట్ చైర్మన్, కాకతీయ విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ రమేశ్ శనివారం కామర్స్ కళాశాల సెమినార్‌హాల్‌లో విడుదల చేశారు. ఈ ఏడాది ఐసెట్ ప్రవేశ పరీక్షకు 75,954 మంది పరీక్షకు హాజరవగా.. 61,613 మంది అభ్యర్థులు అర్హత సాధించారు. ఐసెట్ ప్రవేశ పరీక్షలు 89.58 శాతం ఉత్తీర్ణత సాధించారు. మరిన్ని వివరాలు https://icet.tsche.ac.in అనే వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ రాజిరెడ్డి, రిజిస్ట్రార్ వెంకట్రామరెడ్డి, ప్రిన్సిపాల్ ఆచార్య వరలక్ష్మి, ఆచార్య అమరావేణి, ఆచార్య శ్రీనివాసరావు, ఆచార్య వాసుదేవరెడ్డి, డాక్టర్ నరసింహ పాల్గొన్నారు.

### చరిత్రలో నేటినిజం



(ఆగస్టు 28 ఉద్యమ కవి హీరాలాల్ గోరఖపురి జయంతి..)



సెల్:9494481210

-రాధశ్రీ

## అందరూ మట్టి గణపతులనే పూజించాలి : మంత్రులు ఐకే రెడ్డి, తలసాని



హైదరాబాద్, ఆగస్టు 27: పర్యావరణ హితమైన మట్టి గణపతి విగ్రహాలను పూజించాలని అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రజలకు పిలుపునిచ్చారు. శనివారం తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో సికింద్రాబాద్ గణేష్ టెంపుల్‌లో మట్టి వినాయక విగ్రహాల పంపిణీకి మంత్రులు శ్రీకారం చుట్టారు.

ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ..పర్యావరణ పరిరక్షణలో భాగంగా తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి(టీఎస్‌పీసీబీ పర్యావరణహిత మట్టి వినాయక విగ్రహాలను ప్రతి ఏటా పంపిణీ చేస్తుందన్నారు. ఈ ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా 1.40 లక్షల మట్టి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేస్తున్నామని తెలిపారు.

ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్, కలర్స్, కెమికల్స్ తో చేసిన విగ్రహాల కారణంగా పర్యావరణానికి తీవ్ర నష్టం జరుగుతున్నది. కావున వినాయక చవితి ఉత్సవాల్లో కాలుష్యానికి కారణమయ్యే, ప్రజలకు ఇబ్బందులు సృష్టించే పద్ధతులను పక్కనబెట్టి, పర్యావరణహిత గణపతులకు ప్రాధాన్యమిద్దామన్నారు. అంతకుముందు మంత్రులు వినాయక స్వామి వారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి వారి డాలర్ లాకెట్ ను ఆవిష్కరించారు. కొబ్బరి లడ్డు ప్రసాద విక్రయ సేవలను కూడా మంత్రులు ప్రారంభించారు.

కార్యక్రమంలో దేవదాయ శాఖ కమిషనర్ అనిల్ కుమార్, సికింద్రాబాద్ అసిస్టెంట్ కమిషనర్ కృష్ణ, ఈవో వినోద్ రెడ్డి, ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ జయరాజు, తదితరులు పాల్గొన్నారు.

## ఐఏఎస్‌లకు కేస్‌స్టడీగా మారిన రాజన్న సిరిసిల్ల: మంత్రి కేటీఆర్

హైదరాబాద్, ఆగస్టు 27: ఒకప్పుడు దుర్భిక్ష ప్రాంతంగా ఉన్న రాజన్న సిరిసిల్ల.. ఇప్పుడు ఐఏఎస్‌లకు కేస్ స్టడీగా మారిందని మంత్రి కేటీఆర్ అన్నారు. చెరువులు బాగుచేసుకోవడం, కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల జిల్లా పరిస్థితి సుభిక్షితంగా మారిందన్నారు. జిల్లాలో భూగర్భ నీటిమట్టం ఆరు మీటర్లు పెరిగిందని చెప్పారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో పోటీ పరీక్షల స్టడీ మెటీరియల్‌ను మంత్రులు కేటీఆర్, సబితా ఇంద్రారెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. నీళు నిధులు, నియామకాలే ట్యాగ్‌లైన్‌గా ఏర్పడిన రాష్ట్రాన్ని.. ఎనిమిదేండ్లుగా ఎంతో అభివృద్ధి చేసుకుంటున్నామన్నారు. ఉద్యమ సహచరులంతా ఒకే వేదికపై కనిపించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఉద్యమ సమయంలో అంబేద్కర్ వర్సిటీలో వంటావార్పు కార్యక్రమంలో పాల్గొన్నానని గుర్తుచేసుకున్నారు.

తెలంగాణ వచ్చిన తర్వాత విద్యారంగంలో భారీ మార్పులు వచ్చాయన్నారు. రాష్ట్రంలో 972 గురుకులాలు ఉన్నాయని, 5 లక్షల మంది విద్యారులు ఉన్నారని చెప్పారు. గురుకులాల్లో ఒక్కో విద్యార్థిపై రూ.లక్షకుపైగా ఖర్చు చేస్తున్నామని వెల్లడించారు. స్టడీ మెటీరియల్ యాప్ ద్వారా విద్యార్థులకు అందించాలన్నారు. ఈ ఎనిమిదేండ్లలో కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు ఒక్క విద్యా సంస్థను ఇవ్వలేదని విమర్శించారు.

చెరువు బాగుంటే ఊరు బాగుంటుంది

మన రాష్ట్రంలో రెండు జీవనదులతోపాటు 46 వేల చెరువులు ఉన్నాయని చెప్పారు. తెలంగాణ వచ్చిన తర్వాత సాగునీటి రంగానికి సీఎం కేసీఆర్ అధిక ప్రాధాన్యత ఇచ్చారని వెల్లడించారు. ముఖ్యమంత్రి కృషితో సాగునీటిరంగంలో ఘననీయమైన ప్రగతి సాధించామని తెలిపారు. తెలంగాణలో ఉన్న 46 వేల చెరువులను బాగుచేసుకుంటే దాదాపు నాగార్జున సాగర్ కెపాసిటీ ఉంటుందని ఉద్యమనేత కేసీఆర్‌తోపాటు జయశంకర్ సార్ చెప్పేవారని గుర్తుచేశారు.

ఇప్పుడు ఆ చెరువులన్నింటినీ బాగుచేసుకోవడంతో రాష్ట్రంలో పరిస్థితి మారిందన్నారు. చెరువు బాగుంటే ఊరు బాగుంటుందని చెప్పారు. తెలంగాణ ఫ్లోరైడ్ రహిత రాష్ట్రమని వెల్లడించారు. ఇంటింటికీ నీళ్లు అందించిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అని కేంద్ర జలశక్తి మిషన్ చెప్పిందని స్పష్టం చేశారు. ప్రపంచంలోనే అతిపెద్దదైన ఎత్తిపోతల పథకం కాళేశ్వరం అని, అలాంటి ప్రాజెక్టు మన రాష్ట్రంలో ఉండటం గర్వకారణమన్నారు. శతాబ్దకాలం వరకు తాగునీటికి ఇబ్బంది లేకుండా నీళ్లందించేలా కాళేశ్వరాన్ని నిర్మించామని చెప్పారు.

సంక్షేమరంగంలో దేశానికి ఆదర్శం

సంక్షేమరంగంలో దేశానికి తెలంగాణ ఆదర్శమని మంత్రి కేటీఆర్ అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 46 లక్షల మందికి పెన్షన్ అందిస్తున్నామని చెప్పారు. వృద్ధులకు ఇచ్చే పెన్షన్ పదిరెట్లు పెరిగిందని వెల్లడించారు. ప్రజల జీవన ప్రమాణాలు పెంచకుండా.. ఏం తినాలి, ఏం వేసుకోవాలని డిక్టేట్ చేస్తున్నారని విమర్శించారు. మతం, కులం గురించి కొట్లడుకోవడం వల్లే దేశం వెనుకబడిందని ఆరోపించారు. అయితే కులమతాలను పట్టించుకోకపోవడం వల్లే తెలంగాణ శరవేగంగా అభివృద్ధి చెందుతున్నదని వెల్లడించారు. రాష్ట్ర జీఎస్‌డీపీ రూ. 11.50 లక్షల కోట్లకు చేరిందన్నారు.

టీహబ్, వీహబ్ ద్వారా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ రంగంలో అందరికీ ఉద్యోగాలు ఇవ్వలేమని మంత్రి తెలిపారు. అందుకే ప్రైవేటు రంగంలో పెట్టుబడులను ప్రోత్సహించి ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నామన్నారు. ఐటీ రంగంలో లక్షా 55 వేల ఉద్యోగాలు కల్పించామని పేర్కొన్నారు. తెలంగాణ ఐటీ ఎగుమతులు లక్షా 83 వేల కోట్లకు పెరిగిందని చెప్పారు.

## ఎమ్మెల్సీ కవితకు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సంఘీభావం



హైదరాబాద్, ఆగస్టు 27: టీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ఇంటిపై బీజేపీ కార్యకర్తలు దాడి చేయడాన్ని మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, ఇంద్రకరణ్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఎమ్మెల్సీ కవిత నివాసానికి వచ్చి వారికి సంఘీభావం తెలిపారు. బీజేపీ కార్యకర్తలు దాడి చేయటం దారుణమన్నారు.

రాజకీయ దురుద్దేశంతో ఎమ్మెల్సీ కవిత ఇంటిపై దాడి చేయడాన్ని దుర్మార్గ చర్యగా అభివర్ణించారు. సంస్కృతి, సంప్రదాయాలు అని పదే పదే మాట్లాడే బీజేపీ నాయకులు ఓ మహిళ నాయకురాలి ఇంటిపై దౌర్జన్యం చేయడాన్ని ఏ విధంగా సమర్థించుకుంటారు? అని ప్రశ్నించారు.

కవితకు సంఘీభావం తెలిపిన వారిలో విప్ అరికెపూడి గాంధీ, ఎమ్మెల్యేలు ప్రకాష్ గౌడ్, నన్నపనేని నరేందర్, మంచిరెడ్డి కిషన్ రెడ్డి, పైలట్ రోహిత్ రెడ్డి, కాలె యాదయ్య, రేఖా నాయక్, ఆరూరి రమేష్, ఎమ్మెల్సీలు దండె విఠల్, పట్నం మహేందర్ రెడ్డి, కసిరెడ్డి నారాయణ రెడ్డి, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ అనితా రెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్తలు ఉన్నారు.

## ఏ దేవుడు చెప్పిండు.. తన్నుకు చావండని..? కేటీఆర్ సూటి ప్రశ్న

హైదరాబాద్, ఆగస్టు 27: దేశంలో, రాష్ట్రంలో మత విద్వేషాలను సృష్టిస్తున్న నాయకులపై టీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరోక్షంగా విమర్శలు గుప్పించారు. ఏ దేవుడు చెప్పిండు.. తన్నుకు చావండని కేటీఆర్ ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో పోటీ పరీక్షల స్టడీ మెటీరియల్‌ను మంత్రులు కేటీఆర్, సబితా ఇంద్రారెడ్డి విడుదల చేశారు.

ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. అర్థం కాని విషయం ఏంటంటే.. ఏ దేవుడు చెప్తున్నాడు తన్నుకు చావండని. ఏ మతం దేవుడైనా చెప్పిండా? అని ప్రశ్నించారు. కృష్ణుడు చెప్పిండా? రాముడు చెప్పిండా? యేసుక్రీస్తు చెప్పిండా? అల్లా చెప్పిండా? నా మనషులను పంపిస్తున్న భూమి మీదకు.. ఒకరికొకరు తన్నుకు చావండి.. ఎవరి దేవుడు గొప్ప అనే కాంపిటీషన్ పెట్టుకొని తన్నుకు చావండి అని చెప్పిండా? అని కేటీఆర్ ప్రశ్నల వర్షం కురిపించారు.

ఎందుకు కొట్లాడుతున్నాం.. ఎవరి కోసం కొట్లాడుతున్నాం. ఏ కారణం చేత కొట్లాడుతున్నాం మనం. దేని మీద దృష్టి పెట్టాలి. అసలు మనం దేని మీద పని చేస్తున్నాం. ఈ దేశంలో నీళ్లు లేవని ఒకరు ఏడుస్తుంటే.. తిండి లేక చస్తుంటే, భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఇంటికి నిన్న గాక మొన్న కరెంట్ వస్తే.. దాని మీద మనకు సోయి లేదు. ఏ దేవుడు గొప్ప? అని ప్రశ్నించుకుంటున్నారు. నన్ను అడిగితే మా అమ్మ గొప్ప అని చెబుతాను. ఎవరి అమ్మ గొప్పది అనే కాంపిటీషన్‌కు అర్థముందా? ఎవరి అమ్మ గొప్ప? ఎవరి దేవుడు గొప్ప? అనే ప్రశ్నకు సమాధానం దొరుకుతుందా? అవకాశం ఉందా? అని కేటీఆర్ ప్రశ్నించారు.

మతాల మీద పడి మనం ఎక్కడ్నో పోతున్నాం. చైనా వాడేమో 16 ట్రిలియన్ డాలర్లకు చేరిండు. మనం ఏమో 3.1 ట్రిలియన డాలర్ల వద్దనే ఆగిపోయాం. ఇది సిగ్గుపడాల్సిన పరిస్థితి. కానీ తెలంగాణ రాష్ట్రం దానికి భిన్నంగా పని చేస్తుంది. తెలంగాణ గత 8 ఏండ్లలో సాధించిన విజయాలు, నిధుల విషయంలో ఒక్క మాటలో చెప్పాలంటే.. మీరు బుద్ధి జీవులు కాబట్టి చెప్తున్నాను. 140 కోట్ల భారతదేశ జనాభాలో మనం కేవలం 4 కోట్లు మాత్రమే. మనం దేశానికి 5 శాతం జీడీపీ కంట్రిబ్యూట్ చేస్తున్నాం. ఇది పురోగతి అంటే అని కేటీఆర్ స్పష్టం చేశారు.

## చాంద్రాయణగుట్ట ఫ్లై ఓవర్‌ను ప్రారంభించిన మంత్రి మహమూద్ అలీ



హైదరాబాద్, ఆగస్టు 27: హైదరాబాద్ పాతబస్తీలోని చాంద్రాయణగుట్ట ఫ్లై ఓవర్‌ను హోం మంత్రి మహమూద్ అలీ ప్రారంభించారు. రూ.45.29 కోట్ల వ్యయంతో 674 మీటర్ల పొడవు నిర్మించిన ఈ పైవంతెనతో శంషాబాద్ ఎయిర్‌పోర్టు, వరంగల్, విజయవాడ హైవేల మీదుగా రాకపోకలు సాగించే వాహనదారులకు సుమారు 10 నిమిషాల సమయం ఆదా కానున్నది. స్థానిక ప్రజలకు, వాహనదారులకు ట్రాఫిక్ ఇబ్బందులు తొలగిపోతాయి. కాగా, ఫ్లై ఓవర్ గత మంగళవారమే ప్రారంభించాల్సి ఉండగా, అనివార్య కారణాల వల్ల కార్యక్రమం వాయిదా పడింది.

## పురాతన కట్టడాలకు పూర్వ వైభవం తీసుకోస్తాం : మంత్రి తలసాని

హైదరాబాద్, ఆగస్టు 27: పురాతన కట్టడాలకు పూర్వ వైభవం తీసుకోస్తామని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శనివారం బన్సీలాల్ పేటలోని పురాతన మెట్లబావి వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ చొరవతో పురాతన కట్టడాల పరిరక్షణ, పునరుద్ధరణ పనులు చేపడుతున్నామన్నారు.

మన వారసత్వ సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. మంత్రి వెంట ఓంజఆ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్ కుమార్, అధికారులు తదితరులు ఉన్నారు.

## అందరికి న్యాయం అందించడమే 'న్యాయ సేవా సదనం' లక్ష్యం : జస్టిస్ నవీన్ రావు

హైదరాబాద్, ఆగస్టు 27: ధనిక, పేద అనే తారతమ్యం లేకుండా ప్రతి వ్యక్తికి సమానంగా న్యాయం,స్వేచ్ఛా, సమానత్వం అందించడమే న్యాయ సేవా సదనం ముఖ్య ఉద్దేశమని రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ సంస్థ చైర్మన్, రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ పి. నవీన్ రావు అన్నారు.

జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ, మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో శనివారం జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ భవనంలో.. అసంఘటిత కార్మికులకు వారి హక్కులు, చట్టాల పై అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన మెగా లీగల్ అవేర్ నెస్ క్యాంపునకు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జస్టిస్ పి. నవీన్ రావు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరి జీవితంలో అనేక సమస్యలు ఎదురవుతుంటాయి. మనకు దక్కాల్సిన హక్కులను న్యాయ పోరాటం చేయాల్సి ఉంటుందన్నారు. ఈ న్యాయ పోరాటంలో గెలవడానికి అందరికి మంచి వకీలును పెట్టుకొని విజయం సాధించలేరన్నారు.

అలాంటి పేదవారికి న్యాయం అందించడానికి లీగల్ సర్వీసెస్ అథారిటీని రూపొందించారన్నారు. ఇప్పటి వరకు రాష్ట్ర స్థాయిలో 14 వందల లీగల్ అవేర్ నెస్ క్యాంపులు ఏర్పాటు చేశామన్నారు. పాఠశాల స్థాయిలోనే విద్యార్థులకు సైతం చట్టాలు, వారి హక్కుల పై అవగాహన కల్పించేందుకు పాఠశాల స్థాయిలో, జైల్లో కూడా లీగల్ అవేర్ నెస్ కమిటీలు ఏర్పాటు చేశామన్నారు.

కార్యక్రమంలో మహబూబ్ నగర్ సీనియర్ సివిల్ జడ్జి జస్టిస్ ప్రేమావతి, స్టేట్ లీగల్ సర్వీసెస్ మెంబర్ సెక్రటరీ గోవర్ధన్ రెడ్డి, ఆంజనేయులు, అసనవు కలెక్టర్ పద్మజా రాణి, ఏ.జి.పి సతీష్ గౌడ్, లక్ష్మీపతి గౌడ్, సలీం తదితరులు పాల్గొన్నారు.

## బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థులు ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవాలి



హైదరాబాద్, ఆగస్టు 27: ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదగాలనుకునే విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం ఉన్నత విద్యామండలిలో బాసర ట్రిపుల్ ఐటీపై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. బాసర ట్రిపుల్ ఐటీలో చదువుకుంటున్న విద్యార్థులు అంతర్జాతీయ దిగ్గజ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు పొందే విధంగా చర్యలు చేపట్టాలని ఇంచార్జి వైస్ ఛాన్సలర్‌ను కోరారు. బాసర ట్రిపుల్ ఐటీలోని 150 మంది విద్యార్థులను హైదరాబాద్‌లోని టీ హబ్ సందర్శనకు తీసుకువచ్చి, వారిలో స్టార్టప్‌లకు రూపకల్పన చేసే విధంగా ప్రోత్సహించిన బాసర ట్రిపుల్ ఐటీ ఇంచార్జి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వీ వెంకటరమణ, డైరెక్టర్ శ్రీ సతీష్ కుమార్‌ను అభినందించారు.

టీ హబ్ లోని అత్యాధునిక సౌకర్యాలను బాసర ట్రిపుల్ ఐటి విద్యార్థులందరూ అందిపుచ్చుకొనేలా ప్రణాళిక రూపొందించాలని మంత్రి ఇంచార్జి వైస్ ఛాన్సలర్ ను ఆదేశించారు. ఐటీ కోర్సులు పూర్తయ్యాక విద్యార్థుల ముందున్న అవకాశాలను విద్యార్థులు చదువుతున్న కోర్సుల అంతర్భాగంలోనే వివరించాలని మంత్రి సూచించారు.

# ట్విన్ టవర్ల కూల్చివేత సాఫీగా జరగాలి

(నోయిడాలో అక్రమంగా నిర్మితమైన 40-అంతస్తుల జంట ఆకాశహార్మ్యాలను 28 ఆగష్టు 2022న కూల్చి వేస్తున్న సందర్భంగా)

ఉత్తరప్రదేశ్‌లోని నోయిడా (న్యూ ఓక్లా ఇండస్ట్రియల్ డెవెలప్‌మెంట్ అథారిటీ) సెక్టర్–93 ప్రాంతంలో 'సూపర్‌టెక్ లిమిటెడ్' కంపెనీ అక్రమంగా, నియమనిబంధనలను ఉల్లంఘించి నిర్మాణాలు చేపట్టిందని 'ఎమరాల్డ్ కోర్టు హౌజింగ్ ప్రాజెక్ట్'లో ఫ్లాట్లు కొనుగోలు చేసిన యజమానులు 'రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్'గా ఏకమై 2012లో వేసిన హైకోర్టు కేసుకు సంబంధించి 40–అంతస్తుల జంట ఆకాశహర్మ్యాలను (టవర్ ఎపెక్స్, టవర్ సియానె) కూల్చివేయాలని 12 నవంబర్ 2014న అలహాబాద్ హైకోర్టు తీర్పును వెలువరించింది. ఒప్పందం ప్రకారం గ్రీనరీ ఉండాల్సిన ప్రదేశంలో కొనుగోలుదారులకు తెలుపకుండా నియమాలను కాలరాస్తూ, ప్లాన్లను మార్చేసి, స్థానిక అధికారులతో కుమ్మక్కై, నిబంధనలను తుంగలో తొక్కి అక్రమంగా జంట ఆకాశహర్మ్యాలను నిర్మాణం చేయడంతో టవర్లు అతి దగ్గరగా ఉండడం, సూర్యకాంతి, గాలి రాకుండా చీకటి గదుల్లా మారాయని, తమ నాణ్యమైన జీవనాలకు విఘాతం కలిగిందని ఫ్లాట్లను కొనుగోలు చేసిన యజమానులు హైకోర్టులో కేసు వేయగా, వెంటనే కూల్చి వేయాలని జస్టిస్ చంద్రచుద్, జస్టిస్ యం ఆర్ షాలతో కూడిన హైకోర్టు బెంచ్ సంచలన తీర్పును వెలువరించింది. ఇప్పటి వరకు 32 అంతస్థుల్లో 950 ఫ్లాట్స్ నిర్మించగా, 633 కొనుగోలు చేయడం జరిగింది. వీటిలో 248 మంది నగదు వాపసు తీసుకోగా, 133 మంది సూరర్‌టెక్ కంపెనీ ఇతర వెంచర్లలోకి మారడం, 252 మంది కోర్టులో పోరాడడం జరిగింది. అనంతరం హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ బిల్డర్ సుప్రీం కోర్టులో కేసు వేయగా, దేశ అత్యున్నత న్యాయస్థానం హైకోర్టు తీర్పును సమర్థిస్తూ అంతిమ తీర్పు ఇవ్వడం హర్షదాయకం. సుప్రీమ్ కోర్టు తీర్పులో జంట టవర్లను నిర్మించిన సూపర్‌టెక్ లిమిటెడ్ కంపెనీ 3 నెలల్లో కూల్చి వేయాలని, జంట టవర్లలో ఫ్లాట్లు కొనుగోలు చేసిన వారికి 12 శాతం వడ్డీతో నగదును 2 మాసాల్లో తిరిగి ఇవ్వాలని, కొనుగోలు దారుల సంఘానికి కోర్టు ఖర్చుల కింద 2 కోట్ల నగదు జమ చేయాలనే సంచలనాత్మక తీర్పు ఇచ్చింది. ఈ జంట టవర్లను 28 ఆగష్టు 2022న మధ్యాహ్నం 2:30 గంటలకు కూల్చి వేయడానికి 'ఎడిఫైస్ ఇంజనీరింగ్ సంస్థ' కావలసిన ఏర్పాట్లను వాయువేగంతో చేస్తున్నది. ఈ కూల్చివేతలో సమీప అపార్ట్‌మెంట్లు, ఆవాస గృహాలు అనేకం ఉన్నందున ఎలాంటి ప్రాణ ఆస్థి నష్టం జరుగకుండా అన్ని చర్యలు తీసుకొని ఆధునిక ప్రక్రియ ప్రయోగిస్తున్నామని నిర్వాహకులు తెలుపుతున్నారు.

కూల్చివేత పెద్ద సవాలు:

గత ఏడాది కొచ్చి, కేరళలో కోస్టల్ జోన్ బైలాస్‌ను ఉల్లంఘించి నిర్మించిన బహుళ అంతస్తుల భవణాన్ని సాధారణ 'వర్టికల్ కొలాప్స్' పద్ధతిలో కూల్చి వేయడం జరిగింది. నేడు నోయిడాలోని అధిక రద్దీ ఉండే ప్రాంతంలోని 40–అంతస్తుల ట్విన్ టవర్స్‌ను సురక్షితంగా కూల్చి వేయడం పెద్ద సవాళుగా మారింది. యమన నది ఒడ్డున నిర్మించిన జంట టవర్ల చుట్టు నివాస ప్రాంతాలు ఉండడం, యమన నదిపై దుష్ప్రభావం కలిగించే అవకాశం ఉండడంతో కూల్చి వేత బహు కష్టంగా మారింది. జంట టవర్ల కూల్చివేతను పైనుండి ఒక్కొక్క అంతస్తు కూల్చి వేయడం జరగడానికి చాలా సమయం తీసుకుంటుంది. ప్రస్తుతం అభివృద్ధి చెందిన దేశాల్లో వాడుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుతూ సురక్షిత పద్ధతిని ఉపయోగించి కూల్చాల్సిన పరిస్థితి ఏర్పడింది. కూల్చివేతలో ఏమాత్రం అలసత్వం వహించిన అపార ఆస్థి, ప్రాణ నష్టం జరిగే అవకాశం ఉంటుంది. ఈ విప్లవాత్మక, వాంఛనీయ తీర్పు భవన నిర్మాణ కంపెనీలకు చెంప పెట్టులా, మరోసారి ఎవరూ అక్రమ నిర్మాణాలను చేపట్టకుండా హెచ్చరించేలా ఉన్నది. గతంలో నియమనిబంధనలను అతిక్రమిస్తూ భవనాలను నిర్మించడం, అనంతరం చేతులు తడుపుతూ అధికారిక అనుమతులు పొందడం సర్వసాధారణంగా జరుగుతూ ఉండేది. సంచలనాత్మక సుప్రీం కోర్టు తీర్పుతో నేడు ఎలాంటి అక్రమాలకు తావు లేకుండా అనుమతులు, ప్లాన్ల ప్రకారం నిర్మాణాలు చేపట్టడానికి మార్గం సుగమం అయ్యింది. ధన బలంతో అక్రమ బిల్డర్స్, రియాల్టర్స్‌కు ఈ తీర్పు చెంప పెట్టులా మారింది. 'ది రియల్ ఎస్టేట్ (రెగ్యులేషన్ అండ్ డెవలప్‌మెంట్) ఆక్ట్ – 2016' ప్రకారం భవన నిర్మాణాలు జరగాలని, ఏమాత్రం అక్రమ కట్టడాలు చేపట్టినా మె?దటికే మోసం వస్తుందని బిల్డర్స్ మరువరాదు. కోవిడ్–19 కల్లోలంలో భవన నిర్మాణాల వేగం తగ్గుతూ, కొనుగోలుదారులు మరింత కాలం ఎదురు చూడాల్సి వచ్చింది.

అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట:

నేటికి కొన్ని రాష్ట్రాలు నియమాలకు తిలోదకాలివ్వడం, అక్రమ కట్టడాలకు సక్రమ అనుమతులు ఇవ్వడం జరుగుతూనే ఉంది. గత 10 ఏండ్లుగా అవిశ్రాంతంగా, అన్ని ప్రతికూలాలను అధిగమిస్తూ పోరాడిన (30 హియరింగ్స్‌తో) సూపర్‌టెక్ ట్విన్ టవర్స్ ఫ్లాట్ ఓనర్స్ (సీనియర్ సిటిజన్స్) సంఘాన్ని అభినందిద్దాం. హైకోర్టు కోర్టులో బిల్డర్‌కు ఎదురుగా పోరాడడానికి ఫ్లాట్ ఓనర్స్ చందాలను కూడా సేకరించాల్సి వచ్చింది. ఈ జంట టవర్ల నిర్మాణానికి అక్రమ అనుమతులు ఇచ్చిన అధికారులను, సూపర్‌టెక్ ట్విన్ టవర్స్ బిల్డర్స్ యాజమాన్యాన్ని గుర్తించి తగు కఠిన శిక్షలు విధించడానికి యూపీ ప్రభుత్వం ప్రత్యేక సిట్ (స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్)ను నియమించడం ముదావహం. సత్యాన్ని వధిస్తూ, ధర్మాన్ని చెరసాల్లో బంధించే ప్రయత్నాలు చేస్తున్న భవన నిర్మాణ సంస్థలు, అక్రమ అనుమతులను ఇస్తున్న అవినీతి అధికార ప్రబుద్ధులకు చెరసాలను పరిచయం చేస్తూ, ఇక ముందు ఏ ఒక్క బిల్డర్ దురాలోచన చేయకుండా ఉండేలా ఈ కోర్టు తీర్పు 'కుక్క కాటుకు చెప్పు దెబ్బ' కావాలి. సుందర భారతావని నిర్మాణానికి ఇదో శుభారంభం కావాలి.



– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

## దిల్లీలో భారత్- బంగ్లాదేశ్ మంత్రుల స్థాయి ఉమ్మడి నదుల కమిషన్ 38వ సమావేశం

న్యూఢిల్లీ, ఆగస్టు 27: భారత్– బంగ్లాదేశ్‌ల ఉమ్మడి నదుల కమిషన్ 38వ సమావేశం 25 ఆగస్టు, 2022న దిల్లీలో జరిగింది. భారత ప్రతినిధి బృందానికి కేంద్ర జలశక్తి మంత్రి శ్రీ గజేంద్ర సింగ్ షెకావత్ నాయకత్వం వహించారు. బంగ్లాదేశ్ ప్రతినిధి బృందానికి ఆ దేశ జలవనరుల రాష్ట్ర మంత్రి శ్రీ జాహీద్ ఫరూక్ నాయకత్వం వహించారు. బంగ్లాదేశ్ ప్రతినిధి బృందంలో జలవనరుల శాఖ సహాయ మంత్రి శ్రీ ఏకేఎం ఇనాముల్ హోక్ షమీమ్ కూడా ఉన్నారు. జేఆర్‌సీ ఫ్రేమ్‌వర్క్‌లోని సాంకేతిక పరస్పర చర్యలు ఈ మధ్య కాలంలో కొనసాగుతున్నప్పటికీ, పన్నెండేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత సమావేశం నిర్వహించడం వలన ఇది ప్రాముఖ్యత సంతరించుకుంది. ఈ సమావేశానికి ముందుగా 23 ఆగస్టు 2022 మంగళవారం జలవనరుల శాఖ కార్యదర్శి స్థాయి సమావేశం జరిగింది.

ఈ ద్వైపాక్షిక సమావేశంలో ఉమ్మడి నదీజలాల భాగస్వామ్యం, వరద డేటాను పంచుకోవడం, నదీ కాలుష్యాన్ని పరిష్కరించడం, అవక్షేపణ నిర్వహణ, నదీతీర పరిరక్షణ పనులపై సంయుక్త అధ్యయనాలు నిర్వహించడం వంటి పరస్పర ప్రయోజనాలకు సంబంధించిన అనేక ద్వైపాక్షిక అంశాలపై చర్చలు జరిగాయి. కుషియారా నది మధ్యంతర నీటి భాగస్వామ్యంపై అవగాహన ఒప్పందాన్ని ఖరారు చేశారు. ఈ విషయంపై అక్టోబర్ 2019 భారతదేశం–బంగ్లాదేశ్ అవగాహన ఒప్పందం ప్రకారం త్రిపురలోని సబ్‌రూమ్ పట్టణం యొక్క తాగునీటి అవసరాలను తీర్చడానికి ఫెని నదిపై నీటి తీసుకోవడం కోసం ఇన్‌టేక పాయింట్ రూపకల్పన మరియు స్థానాన్ని ఖరారు చేయడాన్ని ఇరుపక్షాలు స్వాగతించాయి.

భారత్, బంగ్లాదేశ్‌కు సహాయం చేస్తున్న ముఖ్యమైన రంగాలలో ఒకటి, రియల్ టైం వరద డేటాను పంచుకోవడం. బంగ్లాదేశ్ ఊహించని వరదలను పరిష్కరించడంలో సహాయం చేయడానికి భారతదేశం ఇటీవల వరద డేటా షేరింగ్ వ్యవధిని అక్టోబర్ 15 తర్వాత పొడిగించింది.

భారత్– బంగ్లాదేశ్ మొత్తం 54 నదులను పంచుకుంటున్నాయి., వీటిలో 7 నదులు ప్రాధాన్యతపై నీటి భాగస్వామ్య ఒప్పందాల ఫ్రేమ్‌వర్క్‌ను అభివృద్ధి చేయడానికి ముందుగా గుర్తించబడ్డాయి. సమావేశంలో, డేటా మార్పిడి కోసం మరో 8 నదులను ఇందులో చేర్చడం ద్వారా కొనసాగుతున్న సహకారాన్ని విస్తృతం చేయడానికి అంగీకరించాయి. జేఆర్‌సీ యొక్క సాంకేతిక స్థాయి కమిటీలో ఈ విషయం మరింత చర్చించబడుతుంది.

భారతదేశం– బంగ్లాదేశ్ ఉమ్మడి నదుల కమిషన్ 1972 సంవత్సరంలో ఉమ్మడి/సరిహద్దు/సరిహద్దులు దాటిన నదులపై పరస్పర ప్రయోజనాలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించడానికి ద్వైపాక్షిక యంత్రాంగంగా ఏర్పాటైంది.

## లారీ ఢీకొని- యువకుడి మృతి



న్యూఢిల్లీ, ఆగస్టు 27: మండల కేంద్రంలోని అఖిల హాస్పిటల్ ఎదురుగా చెన్నుపాటి ట్రాన్స్ పోర్ట్ కు చెందిన లారీ ఢీకొని ఓ యువకుడు మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. మధిర పట్టణానికి చెందిన కొట్టు మూరి ప్రిన్స్ చర్ల మేజర్ గ్రామ పంచాయతీలో అటెండర్ గా విధులు నిర్వహిస్తున్నారు. అతని కుమారుడైన కొట్టుమూరి రాఘవ (23 ) కాలిబాటన రోడ్డు దాటుతుండగా భద్రాచలం వైపు నుండి చర్ల వైపు వస్తున్న చెన్నుపాటి ట్రాన్స్ పోర్ట్ కు చెందిన ఏపీ16 టి డబ్ల్యూ 0348 నెంబర్ గల లారీ ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు అవిహహితుడు. లారీ డ్రైవర్ స్థానిక పోలీస్ స్టేషన్ లో లొంగిపోయాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అశోక్ తెలిపారు.

## గో ఆధారిత వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి : టీటీడీ జేఈవో

తిరుపతి , ఆగష్టు 27: నోడల్ గోశాలల నిర్వాహకులు తమ పరిధిలోని రైతులు గో ఆధారిత వ్యవసాయం చేసేలా ప్రోత్సహించాలని టీటీడీ జేఈవో వీరబ్రహ్మం సూచించారు . టీటీడీ ఆధ్వర్యంలోని ఎస్వీ గోసంరక్షణ గోశాల ఆధ్వర్యంలో శ్వేతాలో నిర్వహించిన రెండు రోజుల శిక్షణా ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నోడల్ గో శాలలు గో ఆధారిత పంచగవ్య ఉత్పత్తుల తయారీ మీద దృష్టి పెట్టాలని చెప్పారు టీటీడీ పాలక మండలి ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి, ఈవో ఎవి ధర్మారెడ్డి గో సంరక్షణ , గోశాలల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారన్నారు .గో ఆధారిత పంట ఉత్పత్తులు కొనుగోలు చేయడానికి అన్ని ఏర్పాట్లు చేశామన్నారు . గోవుల పోషణ ఇబ్బందిగా ఉన్న గోశాలల్లోని గోవులను టీటీడీ గోశాలకు తరలించి , గో ఆధారిత వ్యవసాయం చేసే రైతులకు ఉచితంగా అందించేలా కృషి చేయాలన్నారు .నోడల్ గోశాలల నిర్వాహకులతో ప్రతి నెల నేరుగా గానీ వర్చువల్ గా కానీ సమావేశం నిర్వహించి సమస్యల పరిష్కార మార్గాలు ఆలోచిస్తామని వీరబ్రహ్మం చెప్పారు . శ్రీ వేంకటేశ్వర గోసంరక్షణ కమిటీ సభ్యులు రామ్ సునీల్ రెడ్డి , గోశాల డైరెక్టర్ డాక్టర్ హరనాథ రెడ్డి, శ్వేతా డైరెక్టర్ ప్రశాంతి , పశువైద్య విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ వెంకట నాయుడు పాల్గొన్నారు.

# చిత్తూరులోని శ్రీ సిటీని సందర్శించిన కేంద్ర విద్యాశాఖ సహాయమంత్రి డాక్టర్ సుభాష్ సర్కార్



న్యూఢిల్లీ, ఆగష్టు 27: రెండ్రోజుల ఆంధ్రప్రదేశ్ పర్యటన నిమిత్తం కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి డాక్టర్ సుభాష్ సర్కార్ శ్రీ సిటీకి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం నాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని వివిధ కేంద్రీయ విశ్వవిద్యాలయాలు, ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీలు, ఐఐటీలు, ఐఐఎం, ఐఐఎస్ఈఆర్ సహా వివిధ ఉన్నత విద్యాసంస్థల ఉపకులపతులు, సంచాలకులతో నూతన జాతీయ విద్యావిధానం (ఎన్ఈపీ–2020) పై సమీక్ష నిర్వహించారు.

శనివారం శ్రీ సిటీ ట్రిపుల్ ఐటీ స్నాతకోత్సవంలో ముఖ్య అతిథిగా మంత్రి పాల్గొననున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి ఆయన ప్రసంగిస్తారు. అంతకుముందుకు, శుక్రవారం ఉదయం శ్రీ సిటీ చేరుకున్న కేంద్ర మంత్రి డాక్టర్ సుభాష్ కు శ్రీ సిటీ ప్రెసిడెంట్ శ్రీ సతీశ్ కామత్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శ్రీ సిటీ పారిశ్రామిక ప్రగతిని ఆయనకు వివరించారు.

శ్రీ సిటీలోని మౌలికవసతులు, పారిశ్రామిక అనుకూల వాతావరణం తదితర అంశాలను పరిశీలించిన మంత్రి, అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో ముందుకెళ్తున్నారంటూ శ్రీ సిటీ ఉన్నతాధికారులను అభినందించారు.

వివిధ పెట్టుబడి అవకాశాలకు పరిపూర్ణమైన పరిష్కాలతో సమగ్రమైన వ్యాపార వ్యవస్థ ఏర్పాటుచేయడంపై మంత్రి హర్షం వ్యక్తం చేశారు. ఈ పారిశ్రామిక కేంద్రంలో రెండు ప్రతిష్టాత్మకమైన ఉన్నత విద్యాసంస్థలు ఏర్పాటుచేయడాన్ని ఆయన ప్రశంసించారు.

పారిశ్రామిక పార్కును సందర్శన సందర్భంగా ఫోక్స్‌న్ గ్రూప్ వారి భారత్ ఎఫ్ఐహెచ్ యూనిట్ల ఉత్పత్తి కేంద్రాన్ని మంత్రి పరిశీలించారు. అనంతరం క్రియా విశ్వవిద్యాలయాన్ని సందర్శించి విద్యార్థులతో సంభాషించారు.

# హన్మకొండ బిజేపి సభకు 100 వాహనాల్లో పార్టీ శ్రేణులతో తరలిన రాజేశ్వర్ రావు దేశ్పాండే



సంగారెడ్డి ఆగస్టు 27 (నేటి నిజం ప్రతినిధి) భారతీయ జనతా పార్టీ సంగారెడ్డి నియోజకవర్గ ఇన్చార్జ్ రాజేశ్వర్ రావు దేశ్పాండే ఆధ్వర్యంలో శనివారము నడు సంగారెడ్డి మండలం నాగపూర్ పిపి సీఎస్ డైరెక్టర్ సంగమేశ్వర్ రెడ్డి, నాగపూర్ వార్డ్ మెంబర్ బోయిని నాగమణి హనుమంతు బిజెపి లో చేరారు.

ఈసందర్భంగా పార్టీ లో చేరిన వారిని ఆయన అభినందించి పార్టీలోకి ఆహ్వానించడానికి సంతోషంగా ఉందని, పార్టీ కోసం కృషి చేయాలని తెలియజేశారు.

అనంతరం హన్మకొండ లో ని ఆర్ట్స్ కాలేజ్ గ్రౌండ్ లో నిర్వహించనున్న మూడవ దశ ప్రజా సంగ్రామ పాదయాత్ర ముగింపు సభ కు ముఖ్య అతిథిగా బిజేపి జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డా పాల్గొంటున్న సందర్భంగా సంగారెడ్డి నుండి బిజెపి అసెంబ్లి ఇంచార్జ్ రాజేశ్వరరావు దేశ్పాండే అధ్వర్యంలో 100 వాహనాల కన్వెయ్ తో వెళ్లనున్నట్టు ఆయన వెల్లడించారు. మునుగోడు అసెంబ్లీ స్థానాన్ని కూడా తమ ఖాతాలో జమ చేసుకుంటామని, తద్వారా టీఆర్ఎస్ కు తామే ప్రత్యామ్నాయమని ధీమా వ్యక్తం చేశారు. హన్మకొండ కు సంగారెడ్డి నుండి భారీ గా పాల్గొనేందుకు వెళ్తున్నామని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి హన్మంత్ రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ నర్సారెడ్డి, జిల్లా కార్యదర్శి మురళిదర్ రెడ్డి, ప్రజాప్రతినిధులు మాణిక్ రావ్,మందుల నాగరాజు, కసిని వాసు,యూవమోర్చ జిల్లా అద్యక్షులు పవన్ ముదిరాజ్ డాక్టర్ రాజు గౌడ్, ఓ బి సి రాష్ట్ర కార్యదర్శి సురేందర్ , దళిత మోర్చా జిల్లా అద్యక్షులు అశ్వంత్, మండల ,పట్టణ అద్యక్షులు పావయ్యా , నర్సింహారెడ్డి ,రవశంకర్,శ్రీనివాస్,అంబదాస్, నాయకులు రాకేశ్ ఠాకూర్, సందీప్ గౌడ్,మరెళ్ళి రవి, సుధాకర్, హర్షవర్ధన్ ,రాజనర్సింహాగౌడ్,ప్రవీణ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## అలిపిరి పాదాలమండపం వద్ద వైభవంగా శ్రీవారి మెట్లోత్సవం

తిరుపతి , ఆగష్టు 27: శ్రీవారి త్రైమాసిక మెట్లోత్సవం ఇవాళ తెల్లవారుజామున తిరుపతిలోని అలిపిరి పాదాలమండపం వద్ద వైభవంగా జరిగింది. దాససాహిత్య ప్రాజెక్టు ప్రత్యేకాధికారి పి.ఆర్. ఆనందతీర్థాచార్యులు మెట్లపూజ నిర్వహించి మెట్లోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రహ్మముహూర్తంలో కాలినడకన మెట్లను అధిరోహించి తిరుమల శ్రీవారిని దర్శించుకోవడం ఎంతో పుణ్యఫలమన్నారు.

పూర్వం పురందరదాసులు, వ్యాసరాజయతీశ్వరులు, అన్నమాచార్యులు, శ్రీకృష్ణదేవ రాయలు లాంటి మహనీయులు భక్తిప్రపత్తులతో తిరుమల కొండలను అధిరోహించి స్వామి వారి వైభవాన్ని దశదిశలా వ్యాప్తి చేశారని వివరించారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్య లో వచ్చిన భజన మండళ్ల సభ్యులు సాంప్రదాయ భజనలు చేసుకుంటూ సప్తగిరుల ను అధిరోహించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన మూడు వేల మందికిపైగా భజన మండళ్ల సభ్యులు భజనలు చేసుకుంటూ తిరుమలకు చేరుకున్నారు.

## విజయవాడ ఫ్లైఓవర్ల నిర్మాణంపై గడ్కరీ సానుకూలం.. సమగ్ర ప్రాజెక్టు రూపకల్పనకు బిడ్లు



న్యూఢిల్లీ, ఆగష్టు 27: విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శ్రీనివాస్ (నాని) ప్రతిపాదించిన మూడు ఫ్లైఓవర్లపై కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ స్పందించారు. ఈ ఫ్లైఓవర్ల నిర్మాణం కోసం డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్)లు సిద్ధమయ్యాక తగిన నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. విజయవాడ మహానాడు జంక్షన్ నుంచి నిడమానూరు జంక్షన్ వరకు ట్రాఫిక్ రద్దీని దృష్టిలో పెట్టుకుని సుమారు 6.5 కి.మీ ఎలివేటెడ్ కారిడార్ నిర్మించేందుకు నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్.హెచ్.ఏ.ఐ) ప్రతిపాదించగా, అందుకు బదులుగా మహానాడు జంక్షన్, రామవరప్పాడు జంక్షన్, ఎనికెపాడు జంక్షన్ల వద్ద ఫ్లైఓవర్ల నిర్మాణం చేపట్టాల్సిందిగా ఎంపీ కేశినేని నాని ప్రతిపాదించారు.

ఈ మేరకు కేశినేని రాసిన లేఖపై కేంద్ర మంత్రి స్పందిస్తూ.. ఈ ప్రతిపాదనలు తమ శాఖ పరిశీలిస్తోందని వెల్లడించారు. ఇందులో భాగంగా ఎన్.హెచ్.ఏ.ఐ ఇప్పటికే ఈ ఫ్లైఓవర్ల నిర్మాణానికి సమగ్ర ప్రాజెక్టు నివేదికలు కోరుతూ బిడ్లను ఆహ్వానించిందని తెలిపారు. డీపీఆర్‌లు రూపొందిన తర్వాత తగు నిర్ణయం తీసుకుంటామని గడ్కరీ వెల్లడించారు.

## అదుపు తప్పిన ట్యాంకర్..పెట్రోల్ ఖాళీ చేసిన జనం



ఖమ్మం,ఆగష్టు 27: (నేటినిజం ప్రతినిధి): జిల్లా తల్లంపాడు దగ్గర పెట్రోల్ ట్యాంకర్ అదుతప్పి నిలిచిపోయింది.అయితే పెట్రోల్ ట్యాంకర్ బోల్తా పడకుండా డ్రైవర్ కంట్రోల్ చేయగలిగాడు.ఈ విషయం తెలుసుకున్న స్థానికులు, బకెట్లు,క్యాన్లు,డబ్బాలతో ఎగబడ్డారు నేనంటే నేను అంటూ పోటీపడ్డారు. ట్యాంకర్ నుంచి పెట్రోల్ ఖాళీ చేశారు అయితే, ట్యాంకర్ నుంచి కారిపోతున్న పెట్రోల్‌ను అదుపుచేయడానికి,పెట్రోల్ తీసుకెళ్తున్న జనాన్ని కంట్రోల్ చేయడానికి కొద్ది సేపు ప్రయత్నం చేశాడు డ్రైవర్.. పెద్ద ఎత్తున జనం రావడంతో అదుపు చేయడం తనవల్ల కాలేదు. దీంతో,మొత్తం ట్యాంకర్ పెట్రోల్ ఖాళీ చేసినట్టుగా తెలుస్తోంది.గతంలోనూ ఇలాంటి ఘటనలు చాలానే జరిగాయి.ప్రమాదానికి గురైన పెట్రోల్ ట్యాంకర్ నుంచి ఎగబడి పెట్రోల్ ఎత్తుకెళ్లిన ఘటనలు ఎన్నో ఉన్నాయి.ఇక,లిక్కర్ లోడ్‌తో వెళ్తున్న ఓ వాహనం బోల్తా పడితే అందులోని లిక్కర్ బాటిళ్లను మొత్తం ఎత్తుకెళ్లిన సందర్భాలున్నాయి. అంతేకాదు ఆ మధ్య కోళ్ల లోడ్‌తో వెళ్తున్న ఓ ట్రక్ బోల్తా పడితే అందులోని కోళ్లను మొత్తం తీసుకెళ్లిపోయారు.ఆ వీడియో సోషల్ మీడియాలో తెగ వైరల్ అయ్యింది.

## త్వరలోనే తిరుమల ఘాట్‌రోడ్డులో ఎలక్ట్రిక్ బస్సులు..

తిరుమల, ఆగష్టు 27: త్వరలోనే తిరుమల ఘాట్‌రోడ్డులలో ఎలక్ట్రిక్ బస్సులు నడుపుతామని ।ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమరావు తెలిపారు. శుక్రవారం ఉదయం విఐపి విరామ దర్శన సమయంలో ఆయన తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయం వెలుపల విలేకరులతో మాట్లాడుతూ, మొదటి దశలో సెప్టెంబర్ చివరికి 20 బస్సులను నడుపుతామని, డిసెంబర్ ఆఖరు లోపల తిరుమలతో పాటు తిరుపతి కేంద్రంగా వివిధ ప్రాంతాలకు 100 బస్సులు నడిపే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామని, ఒక్కసారి బ్యాటరి చార్జ్ చేస్తే 250 కిలోమీటర్ల మేర బస్సు నడుస్తుందని తెలిపారు.

# మిథాలీ రాజ్ తో భేటీ అయిన -జేపీ నడ్డా



హైదరాబాద్, ఆగష్టు 27: శంషాబాద్ లోని నోవాటెల్ హోటల్ కి చేరుకున్నారు బిజెపి జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా .. శంషాబాద్ ఎయిర్ పోర్టు లో జేపీ నడ్డాకి ఘన స్వాగతం పలికారు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఎంపీ లక్ష్మణ్, తరుణ్ చుగ్, పలువురు బిజెపి నేతలు. అనంతరం శంషాబాద్ లోని నోవాటేల్ హోటల్ కి చేరుకున్న జేపీ నడ్డా అక్కడే భారత మహిళా క్రికెటర్, మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్ తో భేటీ అయ్యారు. ఈరోజు వరంగల్ లోని హనుమకొండ లో తెలంగాణ రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు బండి సంజయ్ పాదయాత్ర ముగింపు సందర్భంగా ఏర్పాటు చేస్తున్న భారీ బహిరంగ సభలో పాల్గొనేందుకు జేపీ నడ్డా హైదరాబాద్ కి చేరుకున్నారు. ఈ క్రమంలోనే పలువురు సినీ ప్రముఖులు, రచయితలు, అలాగే క్రీడాకారులతో సమావేశం కానున్నారు. అయితే ఇప్పటికే మిథాలీ రాజ్ తో భేటీ కాగా.. టాలీవుడ్ యంగ్ హీరోలలో ఒకరైన నితిన్ తో నడ్డా బేటీ కానుండడం ఆసక్తికర పరిణామం.

# దేశీ ఆవుల కృత్రిమ గర్భధారణ పద్ధతులను నివారించండి : అల్లోల దివ్యారెడ్డి




హైదరాబాద్, ఆగష్టు 27: దేశీ ఆవు జాతుల్ని విదేశీ ఆవు జాతులతో కృత్రిమ గర్భధారణ పద్ధతుల నివారణకు చర్యలు తీసుకోవాలని పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ను క్లిమామ్ వ్యవస్థాపకురాలు, సేవ్ దేశీ కౌస్ క్యాంపెనర్ అల్లోల దివ్యారెడ్డి కోరారు. సేవ్ దేశీ కౌస్ ప్రచారంలో (బజీలవ టవబతి ఇ‌నీలిబ ఇజీఏజూజీతిణని) భాగంగా మంత్రి శ్రీనివాస్ యాదవ్ ను ఆదర్శనగర్ క్యాంప్ కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు.

కృత్రిమ గర్భధారణ వల్ల మన దేశీ ఆవు జాతులు ఎన్నో అంతరించి పోతున్నాయని, కాలక్రమేణా మన దేశవాళీ ఆవులు కనుమరుగయ్యే ప్రమాదం ఉందని వివరించారు. మన రాష్ట్ర బ్రీడింగ్ పాలసీలో తగిన మార్పులు తీసుకు వచ్చి మన దేశవాళీ గో సంపదను పరిరక్షించాలని ఆమె కోరారు.

ఇదే విషయమై మన గోసంపద కు పునర్వైభవం తీసుకురావడానికి తాను సుప్రీం కోర్టులో మే నెలలో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (ఖఎఒ) దాఖలు చేశామని, ఈ పిటిషన్ ను విచారణకు స్వీకరించిన అత్యున్నత న్యాయస్థానం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీస్ లు జారీ చేసిందని మంత్రికి వివరించారు.

దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి..దేశవాళీ అవుల సంరక్షణకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం రాష్ట్ర పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ ఎస్.రాంచందర్‌ను కలిసి ఇదే అంశాన్ని ఆయనకు వివరించారు.

# వినాయక చవితి ఉత్సవాలపై నిబంధనలు వద్దు : జగన్‌కు సోము లేఖ

అమరావతి, ఆగష్టు 27: వినాయక చవితి ఉత్సవాలపై నిబంధనలు విధించడాన్ని ఏపీ బీజేపీ చీఫ్ సోము వీర్రాజు మండిపడ్డారు. ఈ నిబంధనలను వెంటనే ఎత్తివేయాలని ఆయన కోరారు. ఈ మేరకు ఆయన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి లేఖ రాశారు. చవితి ఉత్సవాలపై నిబంధనలు విధించడం సరికాదన్న ఆయన.. పండుగను స్వేచ్ఛగా, ఆనందంగా జరుపుకునేలా ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. చవితి వేడుకల్లో డీజే సౌండ్ సిస్టమ్, సాంస్కృతిక కార్యక్రమాలను అడ్డుకోవద్దని తన లేఖలో సీఎం జగన్‌ను కోరారు.

వినాయక మండపాలకు తాత్కాలికంగా విద్యుత్ కనెక్షన్ తీసుకోవడం సాధ్యం కాదని సోము వీర్రాజు స్పష్టం చేశారు. నిబంధనల పేరుతో మండపాల నిర్వాహకులను ప్రభుత్వ ఆఫీసుల చుట్టూ తిప్పుకోవడం ఏంటని ఆయన మండిపడ్డారు. చవితి ఉత్సవాలను ఆనందంగా జరుపుకునేలా అవకాశం కల్పించాలని జగన్‌కు లేఖలో కోరారు. వినాయక చవితి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో పల్లెపల్లెలో వీధిలో పట్టణ, నగరాల్లోని అన్ని కూడళ్లలో జరుపుకోవడం అనాదిగా వస్తున్నటువంటి హిందూ ధర్మ ఆచారం అని తమకు తెలియంది కాదన్నారు. అయితే ఇందుకు విరుద్ధంగా ఈ ఏడాది వినాయక చవితి ఉత్సవాల్లో డీజే సౌండ్ సిస్టం, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలుగానీ జరుపడానికి వీలులేకుండా అఫిడవిట్లు ఇవ్వాలని నిర్వాహకులను సంతకాలతో ముందస్తు హామీ పత్రం తప్పనిసరి చేయడం తగదన్నారు.

వినాయక చవితి ఉత్సవాలు జరుపాలంటేనే హిందువులు భయపడేలా నిబంధనలు విధించడం ఏమాత్రం సరికాదన్నారు. ఇలాంటి చర్యల ద్వారా మీ ప్రభుత్వం హిందూ వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నదని మండిపడ్డారు. ఇకనైనా నిబంధనలను వెంటనే ఎత్తివేసి సజావుగా చవితి ఉత్సవాలు జరిగేలా చూడాలని లేఖలో విజ్ఞప్తి చేశారు.



# నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోమియోపతి, నరేలాను సందర్శించిన ఆయుష్ మంత్రి

న్యూఢిల్లీ, ఆగష్టు 27: కేంద్ర ఆయుష్ మంత్రి శ్రీ సర్బానంద సోనోవాల్ నేడు దిల్లీలోని నరేలాలో ఉన్న నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోమియోపతిని సందర్శించారు. ఎన్ఐహెచ్, నరేలా, కోల్‌కతాలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోమియోపతికి చెందిన శాటిలైట్ ఇన్‌స్టిట్యూట్, ఉత్తర భారతదేశంలో స్థాపించబడిన మొట్టమొదటి సంస్థ.

ఈ కార్యక్రమంలో ఆయుష్ మరియు మహిళా శిశు సంక్షేమ శాఖ సహాయ మంత్రి డాక్టర్ ముంజపర మహేంద్రభాయ్ కాలుభాయ్, పార్లమెంటు సభ్యుడు శ్రీ హన్సరాజ్ హన్స్, ఆయుష్ మంత్రిత్వ శాఖ కార్యదర్శి వైద్య రాజేష్ కోటేచా మరియు ఆయుష్ మంత్రిత్వ శాఖ మరియు ఎన్ఐహెచ్ ఇతర అధికారులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

జాతీయ ఆరోగ్య విధానం, ఆరోగ్య సంరక్షణలో ఆయుష్ యొక్క అంతర్-ప్రధాన స్రవంతిని మరియు ఆరోగ్య సంరక్షణ డెలివరీ యొక్క అన్ని స్థాయిలలో విద్య మరియు పరిశోధనలలో ఈ వ్యవస్థలను ఏకీకృతం చేయాలని కూడా సంకల్పించిందని సమావేశాన్ని ఉద్దేశించి శ్రీ సర్బానంద సోనోవాల్ అన్నారు.

ఆయుష్ మంత్రిత్వ శాఖ పరిశోధనాభివృద్ధి, ఇన్నోవేషన్‌లను ప్రోత్సహించడానికి, హోమియోపతిలో విద్య మరియు పరిశోధన కోసం ఉన్నత స్థాయి సంస్థలను అభివృద్ధి చేయడానికి వివిధ చర్యలను చేపట్టిందని ఆయన అన్నారు. ఈ హోమియోపతి ఇన్‌స్టిట్యూట్ ఆయుష్ వ్యవస్థను ప్రాచుర్యంలోకి తెస్తుందని.. దేశంలోని ఉత్తర ప్రాంత అవసరాలను తీరుస్తుందని విశ్వసిస్తున్నట్లు తెలిపారు.

దిల్లీలోని నరేలాలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోమియోపతికి 16 అక్టోబర్, 2018న శంకుస్థాపన చేశారు. ఈ సంస్థ హోమియోపతిలోని వివిధ విభాగాలలో గొప్ప నిపుణులను పరిచయం చేస్తుంది. ఈ సంస్థ 7 విభాగాలను కలిగి ఉంటుంది. హోమియోపతి వైద్యంలో వివిధ విభాగాలలో పీజీ ఉ డాక్టోరల్ కోర్సులను అందిస్తుంది. ఔషధాల అభివృద్ధి, నాణ్యత నియంత్రణ, భద్రతా మూల్యాంకనం మరియు హోమియోపతి అభ్యాసాల యొక్క శాస్త్రీయ ధృవీకరణ యొక్క ప్రాథమిక అంశాలపై కూడా సంస్థ దృష్టి సారిస్తుంది. ఈ సంస్థ విద్య, ఆరోగ్య సంరక్షణ మరియు పరిశోధనలలో ఉన్నతస్థాయి ప్రమాణాలను ఏర్పాటు చేస్తుంది.

ఎన్ఐహెచ్, నరేలా రూ. 287 కోట్లతో నిర్మిస్తున్నారు. హోమియోపతి వ్యవస్థలో ప్రపంచ భాగస్వామ్యం, పరిశోధన కోసం అంతర్జాతీయ సహకార కేంద్రంగా కూడా పని చేస్తుంది. అంతర్జాతీయ ఖ్యాతి గడించిన విశ్వవిద్యాలయాలు/పరిశోధన సంస్థలతో ద్వైపాక్షిక, బహుపాక్షిక సహకారాన్ని ఏర్పరచడంలో ఈ సంస్థ కీలక పాత్ర పోషిస్తుంది.

# కుటుంబ సమేతంగా శ్రీవారిని దర్శించుకున్న మంత్రి పువ్వాడ



తిరుమంతీ, ఆగష్టు 27: తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామివారిని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఇటీవల తన కుమారుని వివాహమైన సందర్భంగా వీఐపీ బ్రేక్ దర్శనం సమయంలో శ్రీవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ కు వేదపండితులు ఆశీర్వచనం అందించగా, టీటీడీ ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలను, పట్టువస్త్రాలను అందజేశారు. అనంతరం మంత్రి అజయ్ మాట్లాడుతూ .జ.తెలుగు రాష్ట్రాలు ప్రగతిపథంలో నడవాలని ఆకాంక్షించారు.

సీఎం కేసీఆర్ దేశ రాజకీయాల్లో కీలక భూమిక పోషిస్తారని.. ఆయన నాయకత్వాన్ని యావత్ భారత్ కోరుకుంటుందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న పథకాలు దేశవ్యాప్తంగా అమలు కావాలని.. సహజ వనరులతో తెలంగాణ రాష్ట్రాన్ని సీఎం కేసీఆర్ అభివృద్ధి చేశారని మంత్రి తెలిపారు.

# సినీ ఫక్కీలో బంగారం దోపిడీకి యత్నం.. ఈడి అధికారుల పేరుతో వ్యాపారులకు బెదిరింపు

అమరావతి, ఆగష్టు 27: ఇటీవల విడుదలైన హీరో సూర్య నటించిన గ్యాంగ్ సినిమాలో ఇన్‌కం ట్యాక్స్, విజిలెన్స్, ఈడి, సీఐడి అధికారులమంటూ బంగారు దుకాణాలు, రాజకీయ నాయకుల ఇళ్లల్లో దాడులు చేసి బంగారం, నగదు దోచుకున్న తరహాలోనే సినీఫక్కీలో ఓ ముఠా ఓ బంగారు దుకాణంలోకి చొరబడి పోలీసు యూనిఫాం ధరించి నకిలీ తుపాకీతో వ్యాపారులను బెదిరించి సుమారు 12 కిలోల బంగారాన్ని దోచుకెళ్లుందుకు స్కెచ్ వేశారు. అయితే ఎటువంటి రికార్డులు పరిశీలించకుండా, క్రయవిక్రయాలకు సంబంధించి అకౌంట్స్ చూడకుండా బంగారం మూటకట్టడంతో అనుమానం వచ్చి వ్యాపారస్తులు ఆ ముఠా సభ్యులను చుట్టుముట్టి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన సంఘటన నగరంలో శుక్రవారం సంచలనం రేపింది.

నగరంలోని కాకర్లవారి వీధిలో సునీల్, ప్రసాద్ అనే సోదరులు లావణ్య జూవెలర్స్ దుకాణం నిర్వహిస్తున్నారు. శుక్రవారం మధ్యాహ్నం వారి దుకాణం ముందు ఓ ఇన్నోవా వాహనం వచ్చి ఆగింది. అందులో నుండి 5 మంది వ్యక్తులు, ఎస్సై యూనిఫాం ధరించిన మరో వ్యక్తి దుకాణంలోకి ప్రవేశించి ముందుగా షెటర్లు మూసివేశారు. తాము ఈడి అధికారులమని దుకాణ యజమాని సునీల్‌కు చెప్పి మీ వద్ద లెక్కకు మించి బంగారం ఉందని సమాచారం వచ్చిందని, తమకు సహకరిస్తే మీ ఒక్కరితోనే పోతుందని, లేదంటే మిగిలిన మీ బంధువులు, ఇతర దుకాణాలపై కూడా దాడులు చేస్తామని బెదిరించారు. యూనిఫాం ధరించిన వ్యక్తి తుపాకీ తీసి వ్యాపారస్తులను చెప్పినట్టు వినాలని, అధికారులకు సహకరించాలని బెదిరింపులకు గురిచేశాడు.

మీ కార్యాలయం ఎక్కడ అని వ్యాపారస్తులు ప్రశ్నించినప్పటికి వారు సరైన సమాధానం చెప్పకుండా సుమారు రూ.7 కోట్లు విలువ చేసే 12 కిలోల బంగారాన్ని మూటకట్టారు. అయితే ఎటువంటి రికార్డులు, అకౌంట్స్ చూడకుండానే బంగారం మూటకట్టి కారు ఎక్కే ప్రయత్నం చేశారు. ఇంతలో అక్కడికి చేరుకున్న బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ నాయకులు శాంతిలాల్ జైన్, అమరా మోహన్‌రావు, ఇతర వ్యాపారస్తులు అనుమానం వచ్చి వారిని చుట్టుముట్టారు. స్థానిక ప్రజలు కూడా పెద్ద ఎత్తున అక్కడికి చేరుకుని పోలీసులకు సమాచారం అందించారు. ట్రాఫిక్ డీఎస్పీ ఎండి అబ్దుల్ సుభాన్, సంతపేట ఇన్‌స్పెక్టర్ షేక్. అన్వర్‌బాషా, ఎస్సైలు, సిబ్బంది అక్కడికి చేరుకునేటప్పటికే వ్యాపారస్తులు ఆ ముఠా సభ్యులకు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఆరు మంది ముఠా సభ్యులను పోలీసులు అదుపులోకి తీసుకుని ఇన్నోవా వాహనం, తుపాకీని సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు.

పట్టుబడిన ముఠా సభ్యులు సత్యసాయి జిల్లా కనగానిపల్లికి చెందిన ఎ. రమేష్, జి. బాబు, యోగానందగౌడ్, కర్నూలుకు చెందిన మద్దిలేటి గౌడ్, జి. బాలకృష్ణ, హైదరాబాద్‌కు చెందిన జి. కిషోర్‌రావులుగా పోలీసులు గుర్తించారు. వీరు వినియోగించిన ఇన్నోవా వాహనం బాలాజీనగర్ సెంటర్లో అద్దెకు తీసుకొచ్చినట్లు పోలీసులు గుర్తించారు. అంతేకాకుండా వీరు మరో ఇన్నోవా వాహనాన్ని కనుపర్తిపాడు క్రాస్ రోడ్డు వద్ద పార్కింగ్ చేసి ఉండడాన్ని పోలీసులు విచారణలో తెలుసుకుని ఆ వాహనాన్ని కూడా సీజ్ చేశారు. సీఐ అన్వర్‌బాషా ముఠా సభ్యులను పూర్తి స్థాయిలో విచారిస్తున్నారు. పూర్తి వివరాలు దర్యాప్తులో తెలియాల్సి ఉంది.

# వర్క్ ఫ్రమ్ హోమ్‌కు శుభం కార్డు ! టీసీఎస్ అధికారిక ప్రకటనతో త్వరలో ఆఫీసులకు ఐటీ ఉద్యోగులు

హైదరాబాద్, ఆగష్టు 27: ప్రముఖ ఐటీ కంపెనీ టీసీఎస్ ఉద్యోగుల వర్క్ ఫ్రమ్ హోమ్‌కు అధికారికంగా ముగింపు పలుకుతూ ప్రకటన చేయడంతో త్వరలో మిగిలిన కంపెనీలు కూడా ఇదే బాటలో పయనించనున్నట్లు తెలుస్తోంది. తమ కంపెనీ ఆఫీసులు ఎలా ఉంటాయో కూడా తెలియకుండా వేలాది మంది కొత్త ఉద్యోగులు కంపెనీలో చేరి అప్పుడే రెండేళ్లు గడిచిందని టీసీఎస్ కంపెనీ తెలిపింది. వీరంతా త్వరలో ఆఫీసులను తొలిసారిగా చూడబోతున్నారని పేర్కొంది. అయితే వీరిలో ఎంతమంది కంపెనీలో కొనసాగుతారో తెలియదని, ఏ ఇతర కంపెనీ అయినా ఇంకా వర్క్ ఫ్రమ్ హోమ్ కొనసాగిస్తే అందులోకి వారంతా వెళ్లే అవకాశాలు లేకపోలేదని కంపెనీ సీనియర్ అధికారులు పేర్కొంటున్నారు. హైదరాబాద్‌లోనూ టీసీఎస్ కంపెనీలో వేలాది మంది ఐటీ ఉద్యోగులు పనిచేస్తుంటారు. తాజాగా వర్క్ ఫ్రమ్ హోమ్‌కు కంపెనీ ముగింపు పలుకుతూ కంపెనీ నిర్ణయం తీసుకోవడంతో వీరంతా భాగ్యనగరంలోని తమ ఆఫీసుల బాట పట్టనున్నారు.

2020 మార్చిలో కొవిడ్ సంక్షోభం తలెత్తి కరోనా కేసులు పెరిగిన తర్వాత ఇళ్లకే పరిమితమై పనిచేస్తున్న వీరు త్వరలో ఆఫీసుల నుంచి పనిచేయడానికి సిద్ధమవాల్సి ఉంటుందని టీసీఎస్ కంపెనీ ప్రతినిధులు పేర్కొంటున్నారు. సాధారణంగా ఐటీ కంపెనీల మధ్య వ్యాపార పరంగా తీవ్ర పోటీ నెలకొని ఉంటుందని, టీసీఎస్ లాంటి కంపెనీ తమ ఉద్యోగులను ఆఫీసుల నుంచి పనిచేయించడానికి సిద్ధమైనపుడు మిగిలిన కంపెనీలు కూడా తప్పనిసరిగా ఉద్యోగులను ఆఫీసుల నుంచి పనిచేయిస్తాయని పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి. లేదంటే వ్యాపారంలో ఉత్పాదకతలో వెనుకబడిపోయే అవకాశాలున్నట్లు ఆయా కంపెనీలు భావిస్తాయని వారు చెబుతున్నారు.

ఈనేపథ్యంలో ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉన్న లక్షలాది మంది ఐటీ ఉద్యోగుల్లో కనీసం 50 శాతం మందైనా అతి త్వరలో మళ్లి ఆఫీసుల నుంచి పనిచేస్తారని, దీంతో ఐటీ రంగంపై పరోక్షంగా ఆధారపడ్డ వేలాది మంది వెండార్లు లాభపడనున్నారని, తద్వారా భారీగా పరోక్ష ఉపాధి లభించనుందని ప్రభుత్వ ఐటీ, పరిశ్రమల శాఖ వర్గాలు అంచనా వేస్తున్నాయి. వ్యాక్సినేషన్ ప్రారంభమైన తర్వాత వచ్చిన కొవిడ్ థర్డ్ వేవ్, ఫోర్త్ వేవ్‌లలో కేసులు పెరిగినప్పటికీ పెద్దగా ఎవరూ ఆస్పత్రుల పాలు కాకపోవడంతో ఇటు రాష్ట్ర, అటు కేంద్ర ప్రభుత్వాలు ఎప్పటి నుంచో ఐటీ కంపెనీలు ఉద్యోగులను ఆఫీసుల నుంచి పనిచేయించే దిశగా సంప్రదింపులు జరుపుతున్నాయి. అయితే ఉద్యోగుల ఆరోగ్య భద్రత ముఖ్యమని భావించిన కంపెనీలు కొవిడ్‌తో ఇకముందు ముప్పు లేదని నిర్ధారణకు వచ్చిన తర్వాత అన్ని జాగ్రత్తలతో ఆఫీసులు తెరిచేందుకు సిద్ధపడ్డట్లు తెలుస్తోంది.

ఇటీవలి కాలంలో కార్యాలయం ప్రదేశ లీజుల్లో దేశంలోని అన్ని మెట్రో నగరాలు దూసుకుపోతుండగా ఐటీ హబ్‌లుగా పేరొందిన బెంగళూరు, హైదరాబాద్‌లు ఈ రేసులో ముందంజలో ఉన్నాయి. హైదరాబాద్‌లో ఇటీవలి కాలంలో రికార్డుస్థాయిలో ఆఫీసు ప్రదేశం లీజు ఒప్పందాలు జరుగుతున్నట్లు పలు కన్సల్టెన్సీలు పేర్కొంటున్నాయి. ప్రస్తుతం నగరంలో 44 మిలియన్ స్క్వేర్ ఫీట్‌ల కార్యాలయ ప్రదేశం నిర్మాణంలో ఉందని అవి చెబుతున్నాయి.

# కేసీఆర్‌ది సంక్షేమం..బీజేపీది వైషమ్యం : మంత్రి జగదీష్ రెడ్డి ఫైర్

సూర్యాపేట , ఆగష్టు 27: సీఎం కేసీఆర్ ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తుంటే బీజేపీ ప్రజల మధ్య వైషమ్యాలను రెచ్చగొడుతుందని విద్యుత్ శాఖ మంత్రి జగదీష్ రెడ్డి అన్నారు. శనివారం

సూర్యాపేటలో నూతన ఆసరా ఫించన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు.

కేసీఆర్ రైతు సంక్షేమ కార్యక్రమాలను దేశ వ్యాప్త రైతు సంఘాలు మెచ్చుకుంటున్నాయి. బీజేపీ కేసీఆర్ పై కుట్రతో రాష్ట్ర సంక్షేమాన్ని చీకట్లోకి నెట్టే కుట్ర చేస్తుందని మండిపడ్డారు. బీజేపీ దుర్మార్గపు సిద్ధాంతాలను వ్యతిరేకించే రాష్ట్రాలను కూల్చే ప్రయత్నం చేస్తున్న బీజేపీ

చట్టబద్ధ సంస్థలను దుర్వియోగం చేసి దేశంలో కల్లోలానికి కారణమవుతున్నదని ఆరోపించారు. బీజేపీ కుట్రలను నిలదీసి ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలన్నారు.

దేశ ప్రజలంతా ఏకమై మోదీ దుశ్చర్యలను నిలదీయాల్సిన అవసరముందన్నారు.

బీజేపీ ఎన్ని కుట్రలు చేసినా చివరకు ధర్మమే గెలుస్తుందని ఆయన పేర్కొన్నారు. జనమే లేని బీజేపీ సభలను అడ్డుకునే అవసరం మాకు లేదు. అనుమతులు లేకుండా సభలు ఎలా జరుగుతాయో బీజేపీకి తెలియదా? అని సూటిగా ప్రశ్నించారు. బీజేపీ ఎన్ని జిమ్మిక్కులు చేసినా ప్రజలు ఆదరించాన్నారు.

# చెత్త వాహనాల ఉపయోగించే ఒప్పందం వెనుక స్కాం: పట్టణ పౌర సమాఖ్య




ఎన్టీఆర్ , ఆగష్టు 27: రాష్ట్ర వ్యాప్తంగా చెత్త వాహనాల ఉపయోగించే ఒప్పందం వెనుక పెద్ద కుంభకోణం దాగి ఉన్నదని ఆంధ్రప్రదేశ్ అర్బన్ సిటిజన్స్ ఫెడరేషన్ (ఏపీయూసీఎఫ్) సమాఖ్య ఆరోపించింది. జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమాన్ని 'జగనన్న చెత్త సంకల్పం' అని అభివర్ణించింది. క్లీన్ ఏపీ పథకం పేరుతో ప్రభుత్వం పౌరుల జేబులను శుభ్రం చేస్తున్నదని సమాఖ్య కన్వీనర్ సీహెచ్ బాబూరావు ఆరోపించారు. ఆస్తిపన్నులో చెత్తపన్నును చేర్చినప్పుడు మళ్లీ చెత్తపన్ను ఎలా వసూలు చేస్తారని ప్రశ్నించారు. ఇది పూర్తిగా రాజ్యాంగ విరుద్ధం, దీనికి చట్టపరమైన అనుమతి లేదని విజయవాడలోని బాలోత్సవ్ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ చెప్పారు. చెత్త పన్ను వసూళ్లను తీవ్రంగా తప్పుబట్టిన ఆయన.. ఈ కొత్త పన్నుతో ప్రజలపై రూ.500 కోట్ల భారం వేసేందుకు కుట్రపన్నారని దుయ్యబట్టారు.

స్వచ్ఛ భారత్ ముసుగులో కేంద్ర ప్రభుత్వం పారిశుధ్య పనులను కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తున్నదని, కేంద్రం ఒత్తిడి వల్లనే రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై భారం మోపిందని బాబూరావు విమర్శించారు. మున్సిపాలిటీ, మున్సిపల్ కార్పొరేషన్ల ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వకుండానే చెత్త వాహనాలను వినియోగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకున్నదని ఆరోపించారు. ఒక్కో చెత్త వాహనాలకు స్థానిక సంస్థలు రూ.63 వేలు చెల్లించాల్సిన ఒప్పందం వెనుక భారీ కుంభకోణం జరిగినట్లు అనుమానిస్తున్నామన్నారు. కార్పొరేట్ సంస్థలకు ఏడాదికి రూ.600 కోట్లు చెల్లించాలన్న ఒప్పందంలో పారదర్శకత లేదని ఆయన పేర్కొన్నారు. పుణెకు చెందిన స్వయంభూ ట్రాన్స్‌పోర్ట్ కంపెనీతో ఈ ఒప్పందం కుదిరినట్లుగా సమాచారం ఉన్నదని ఆయన చెప్పారు.

పారిశుధ్యం, ప్రజారోగ్యం పరిరక్షించాల్సిన బాధ్యత స్థానిక సంస్థలు, ప్రభుత్వంపై ఉన్నదని ఏపీ యూసీఎఫ్ కన్వీనర్ బాబురావు అన్నారు. ప్రజాభిప్రాయం తీసుకోకుండా చెత్త పన్ను వసూలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. చెత్త పన్నుపై హైకోర్టులో ఇప్పటికే అనేక పిటిషన్లు దాఖలయ్యాయని, న్యాయవ్యవస్థ ఇంకా నిర్ణయం తీసుకోనప్పుడు పన్ను వసూలు చేయడం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని గుర్తు చేశారు. ఈ విషయంపై మున్సిపల్ శాఖ మంత్రి వివరణ ఇవ్వాలని, ప్రజలకు మంత్రి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. చెత్త పన్నుకు వ్యతిరేకంగా ప్రజా సంఘాలు కూడా ఆందోళనకు దిగాలని బాబూరావు పిలుపునిచ్చారు.

# అర్హులందరికి ఆసరా పెన్షన్లు : మంత్రి శ్రీనివాస్ గౌడ్

మహబూబ్‌నగర్ ఆగష్టు 27: రాష్ట్రంలోని అర్హులందరికి ఆసరా పెన్షన్లు అందిస్తామని ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో నూతంగా మంజూరైన ఆసరా పెన్షన్లను లబ్ధిదారులకు అందజేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గడచిన 70 సంవత్సరాలుగా ప్రజలు తాగునీటికి, విద్యుత్ కు ఇబ్బందులు ఎదుర్కొన్నారని, కేవలం 200 రూపాయల పెన్షన్ తో నెట్టుకొచ్చారన్నారు. అయితే టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 2016 రూపాయలు పెన్షన్ ఇస్తున్నామని తెలిపారు.

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీలో 7,436 మందికి నెల నెలా 32 లక్షల రూపాయల పెన్షన్ ఇచ్చే వారని, ఇప్పుడు 13,029 మందికి 8 కోట్ల 63 లక్షల రూపాయలు నెలకు పెన్షన్ ఇస్తున్నామని పేర్కొన్నారు. ఎదిర అభివృద్ధి కోసం ఎంతో కృషి చేస్తున్నామని తెలిపారు.

ఇంకా పింఛన్ రాకుండా మిగిలిపోయిన వారిని గుర్తించి మళ్లీ పెన్షన్లు ఇస్తామని మంత్రి తెలిపారు.

కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్, మున్సిపల్ చైర్మన్ కె సి నర్సింహులు, వార్డు కౌన్సిలర్ యాదమ్మ, మున్సిపల్ కమిషనర్ ప్రదీప్ కుమార్, మున్సిపల్ ఇంజినీర్ సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.



ఆహ్వానము
భవానీ సాహిత్య వేదిక
సీతారాంపూర్, కరీంనగర్.
శ్రీమతి వనితారాణి నోముల కవిత్వం
సప్తపర్ణిక
గ్రంథావిష్కరణ సభ

తేది : 28.08.2022 ఆదివారం
సమయం ఉ॥ 10.00 గంటలకు
వేదిక : ఫిలింభవన్, కరీంనగర్.
ముఖ్య అతిథి & గ్రంథావిష్కర్త :
శ్రీ మౌనశ్రీ మల్లిక్ గారు
ప్రముఖ కవి, సినీ గేయ రచయిత, హైదరాబాద్.
సభాధ్యక్షులు :
డా॥ వైరాగ్యం ప్రభాకర్ గారు, అధ్యక్షులు, భవానీ సాహిత్య వేదిక, కరీంనగర్.
విశిష్ట అతిథులు :
"ట్యాగ్‌లైన్ కింగ్" ఆలపాటి గారు
సుప్రసిద్ధ రచయిత, అడ్వర్టైజింగ్ నిపుణులు, మోటివేషనల్ స్పీకర్, హైదరాబాద్.
శ్రీ ఎర్రం రాజారెడ్డి గారు
న్యాయవాది, కరీంనగర్ & ఉమ్మడిజిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు
గౌరవ అతిథులు :
శ్రీమతి నిర్మలా రాణి తోట గారు
కవయిత్రి, తెరవే సభ్యులు
శ్రీమతి అనూశ్రీ గౌరోజు గారు
కవయిత్రి, శ్రీపదాలు రూపకర్త, గోదావరిఖని
శ్రీ నరేష్‌కుమార్ నోముల గారు
సీనియర్ అసిస్టెంట్, ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల, సిద్దిపేట.
గ్రంథ పరిచయం :
శ్రీమతి కాసనగొట్టు స్వప్న గారు, కవయిత్రి, ఉపాధ్యాయులు
ఆహ్వానించువారు :
అందరూ ఆహ్వానితులే ! గుండు రమణయ్య కవి, చిత్రకారుడు

# మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించిన రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు.



మహబూబాబాద్,ఆగష్టు 27: (నేటినిజం ప్రతినిధి): పాలకుర్తి నియోజక వర్గంలోని పెద్ద వంగర మండలం కోరిపల్లి గ్రామానికి చెందిన మండల పార్టీ రైతు సెల్ ఉపాధ్యక్షులు దోనాల రత్నాకర్ రెడ్డి తల్లి దోనాల సుగుణమ్మ ఇటీవల మరణించగా మరియు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన ఉట్ల గణేష్, వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన రాష్ట్ర పంచాయతీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరా శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు . వీరితో పాటు మండల పార్టీ అధ్యక్షులు ఈదురు ఐలయ్య ,పాలకుర్తి దేవస్థానం చైర్మన్ వెనుకదాసుల రాంచంద్రయ్య శర్మ,నాయకులు శ్రీరాం సుదీర్ ,మాజీ ఎఫ్ఎసిఎస్ వైస్ చైర్మన్ ముత్తినేని శ్రీనివాస్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీరాం సంజయ్, కోరిపల్లి సర్పంచ్ గాజుల శోభ, మండల కో ఆప్షన్ మెంబర్ ముజీబుద్దిన్, మాజీ సర్పంచ్ జ్ఞనేశ్వరచారి,గంట్లకుంట సర్పంచ్ చింతల భాస్కర్,మాజీ ఎంపిటిసి దంతలపెల్లి రవి,మండల ఎస్సి సెల్ అధ్యక్షులు చిలుక బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ సభ కు తరలివెళ్లిన బీజేపీ శ్రేణులు.



రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 27: (నేటినిజం ప్రతినిధి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ చేపట్టిన ప్రజాసంగ్రామ యాత్ర–మూడో విడత పాదయాత్ర ముగింపు సందర్భంగా ఈరోజు వరంగల్ లో ఏర్పాటు చేసిన బహిరంగ సభ కు తొర్రూరు మండలం నుండి బీజేపీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలి వెళ్ళడం జరిగింది. బీజేపి రాష్ట్ర నాయకులు నియోజకవర్గ ఇన్చార్జి పెదగాని సోమయ్య జెండాను ఊపి వాహనాలు ప్రారంభం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసిఆర్ ఎన్ని కుట్రలు పన్నినా అడ్డంకులు సృష్టించినా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ప్రజాసంగ్రామ యాత్ర విజయవంతం అయింది అని తెలిపారు. ప్రజాస్వామ్య యుతంగా రాజ్యాంగ బద్ధంగా బండి సంజయ్ చేపట్టిన ప్రజాసంగ్రామ యాత్ర ప్రజల్లో చైతన్యం నింపింది అని తెలిపారు. ప్రజల స్పందన ను ఓర్వలేక కేసీఆర్ సర్కారు నియంతృత్వ అహంకార ధోరణి తో అనేక ఇబ్బందులు పెట్టినా న్యాయ స్థానం మొట్టికాయలు వేసింది అని తెలిపారు. రాష్ట్రంలో బీజేపీ నేతృత్వంలో పేదల ప్రభుత్వం రాబోతుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి తొర్రూరు శాఖ అధ్యక్షుడు పల్లె కుమార్,రూరల్ మండలం అధ్యక్షుడు బొచ్చు సురేష్, జిల్లా కార్యదర్శి పరుపాటి రాం మోహన్ రెడ్డి,15వ వార్డు కౌన్సిలర్ కొలుపుల శంకర్, జిల్లా నాయకులు కస్తూరి పులేందర్,పూసాల శ్రీమాన్, మంగళపల్లి యాకయ్య, పైండ్ల రాజేష్, రాయపురం రాజకుమార్, కాగు నవీన్,కొండ యాకన్న, కొమ్ము రాము,నూకల నవీన్,రవి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు




# పర్యావరణ పరిరక్షణకు అందరూ పాటుపడాలి

## – స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో జ్యూట్ బ్యాగులను పంపిణీ చేసిన – మేయర్ పునుకొల్లు నీరజ




ఖమ్మం,ఆగష్టు 27: (నేటినిజం ప్రతినిధి): పర్యావరణ పరిరక్షణకు అందరూ పాటుపడాలని తగిన జాగ్రత్తలను పాటించి పర్యావరణాన్ని కాపాడాలని ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ అన్నారు. నగరంలోని స్మార్ట్ కిడ్జ్ పాఠశాల యాజమాన్యం ఆ పాఠశాలలో చదివే విద్యార్థుల తల్లిదండ్రులకు పర్యావరణ పరిరక్షణలో భాగంగా జ్యూట్ బ్యాగులను పాఠశాల పేరిట తయారు చేయించింది.

ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మేయర్ పునుకొల్లు నీరజ డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహారా, 55, 56, డివిజన్ కార్పొరేటర్లు మోతారపు శ్రావణి సుధాకర్, పైడిపల్లి సత్యనారాయణ రోహిణి, లతో కలిసి విద్యార్థుల తల్లిదండ్రులకు జ్యూట్ బ్యాగులను అందజేశారు.

ఈ సందర్భంగా మేయర్ పునుకొల్లు నీరజ విద్యార్థులను వారి తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడుతూ స్మార్ట్ కిడ్జ్ పాఠశాల యాజమాన్యం మంచి ఆలోచనతో "పర్యావరణ పరిరక్షణ" కోసం ప్లాస్టిక్ కవర్లను నిషేధించి జ్యూట్ బ్యాగులను విద్యార్థులకు తల్లిదండ్రులకు అందజేయడం శుభపరిణామం అని, ఇదే ఆలోచనను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని, ప్లాస్టిక్ కవర్లు వాడటం వల్ల తీవ్రమైన నష్టం జరుగుతుందని, ప్లాస్టిక్ భూమిలో కరగకపోవటం వల్ల మృత్తికలో లోపాలు ఏర్పడుతున్నాయని, అలాంటి పరిస్థితుల్లో భూమిలో మంచి పంటలు పనీడటానికి అవకాశాలు లేవని, ప్లాస్టిక్ వాడకం వల్ల భూమి మీద వ్యర్థాలు పెరిగిపోతున్నాయని తద్వారా మట్టి కాలుష్యం నీటి కాలుష్యం, వివిధ రూపాల్లో ప్రభావం చూపుతున్నాయని, విద్యార్థులు పర్యావరణంపై అవగాహన కలిగి ఉండి దాన్ని కాపాడాల్సిన బాధ్యతను కూడా తీసుకోవాలన్నారు.

పాఠశాల కరస్పాండెంట్ చింత నిప్పు కృష్ణ చైతన్య మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ నిషేధించి పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలని, దీనిలో భాగంగానే తమ పాఠశాల తరఫునుండి "జూట్" బ్యాగులను తయారు చేయించి విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు అందజేయడం జరిగిందని ఆయన అన్నారు.

ఈ కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహారా 55వ డివిజన్ కార్పొరేటర్ మోతారపు శ్రావణి సుధాకర్, పైడిపల్లి సత్యనారాయణ రోహిణి, పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, పాఠశాల ప్రిన్సిపాల్ ఉపాధ్యాయులు సిబ్బంది విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# విద్యార్థులకు విద్యతో పాటు క్రీడల పట్ల అవగాహన కల్పించాలి



కరీంనగర్ , ఆగష్టు 27: (నేటినిజం ప్రతినిధి): విద్యార్థులకు విద్యతో పాటు క్రీడల పట్ల అవగాహన కల్పించాలని ,అలాగే అందులో పాల్గొనేలా ప్రోత్సాహకాలను అందించాలని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా?వి. నరేందర్ రెడ్డి అన్నారు కరీంనగర్ స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ – టెక్నో స్కూల్ విద్యార్థికి అంతర్జాతీయ కరాటే పోటీలలో రజత పతకాలు సాధించడంపట్ల ఏర్పాటు . చేసినటువంటి ప్రత్యేక సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలలో ఎన్నో విషయాలు నేర్చుకునేవి ఉంటాయని ప్రత్యేకంగా విజయాలను సాధించే విధానాలను తెలుసుకుంటామని చెప్పారు . క్రీడల్లో లభించే లాభాలు మరే ఇతర అంశాల్లో సాధ్యం కాదని చెప్పారు . విద్యార్థులకు పోటీతత్వంతో పాటు సత్సంబంధాలు ఏర్పరిచే విధంగా ఉంటాయని తెలుపుతూ ప్రతి విద్యార్థి క్రీడా రంగాల్లో పాల్గొని వాటిలోని విషయాలను సముచితంగా తెలుసుకొని ఉత్తమంగా ఉండాలని వారు సూచించారు . క్రీడల ద్వారా కలిగే విశిష్ట లాభాలవలన పాఠశాల విద్యా ప్రణాళికలో భాగంగా విద్యార్థులను వివిధ పోటలకు ఎంపిక చేయడమే కాకుండా అందులో విజయాన్ని సునాయాసంగా అందుకోవడానికై ప్రోత్సాహాన్ని అందిస్తున్నామని చెప్పారు . ప్రాథమికంగా విద్యార్థులకు పాఠశాలలో ఎంపిక పరీక్ష నిర్వహిస్తామని అందులో ప్రతిభను కనబరచిన వారికి పోటీలకు ఎంపిక చేస్తామని వారు చెప్పారు . ఈ క్రమంలో ఇటీవల కాలంలో కర్ణాటక రాష్ట్రంలోని శివమొగ్గాలో కర్ణాటక కరాటే అసోసియేషన్ మరియు శివమొగ్గ కరాటే అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహింపబడిటువంటి అంతర్జాతీయ కరాటే పోటీలలో పాఠశాలకు చెందినటువంటి కె.వి.యస్ . రిత్విక్ , 9 వ తరగతి అత్యుత్తమ ప్రతిభతో కరాటే మరియు కుమిటే విభాగాలలో రజత పతకాలు కైవసం చేసుకున్నాడని హర్షం వ్యక్తం చేశారు . రజత పతకాలు మరియు తెలంగాణ రాష్ట్రానికి వన్నె తెచ్చినందుకు సంతోషాన్ని వ్యక్తం చేస్తూ విజేతకు పుష్పగుచ్ఛంతో పాటు ప్రశంస పత్రాన్ని అందజేసి భవిష్యత్లో నిర్వహించబోటువంటి మరిన్ని పోటీలలో అద్భుత విజయాలు నమోదు చేయాలని వారు ఆకాంక్షించారు . ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ , ఉపాధ్యాయ బృందం విద్యార్థులు పాల్గొన్నారు

# అడవి దొంగ సినిమా చూపిస్తూ సర్జరీ.. గాంధీ వైద్యులపై హరీశ్‌రావు ప్రశంసలు

హైదరాబాద్, ఆగష్టు 27: కార్పొరేట్ ఆస్పత్రుల్లో లక్షల రూపాయాలు విలువజేసే శస్త్రచికిత్సలను ఉచితంగా నిర్వహిస్తున్న గాంధీ దవాఖాన వైద్యులు మరో ఘనత సాధించారు. స్పృహలో ఉన్న వృద్ధురాలి మెదడులోని కణితిని 'అవేక్ క్రేనియటోమి' శస్త్రచికిత్స ద్వారా విజయవంతంగా తొలగించారు. ఆమెకు మెగాస్టార్ చిరంజీవి నటించిన అడవి దొంగ సినిమా చూపిస్తూ సర్జరీ నిర్వహించారు. ఆ సర్జరీ విజయవంతం కావడంతో రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు గాంధీ వైద్యులపై ప్రశంసల వర్షం కురిపించారు.

గాంధీ వైద్యులను ప్రశంసించిన చిరంజీవి..

ఇక చిరంజీవికి కూడా ఈ విషయం తెలియడంతో గాంధీ వైద్యులను ప్రశంసించారు. ఆమె అభిమానానికి ధన్యవాదాలు తెలిపారు. ఆమె వివరాలు తెలుసుకోమంటూ తన పీఆర్వో ఆనంద్‌ను గాంధీ ఆస్పత్రికి పంపారు. ఈ నేపథ్యంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజారావును చిరు పీఆర్వో కలిసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆనంద్ ఆపరేషన్ చేయించుకున్న మహిళను కలిసి మాట్లాడారు. తాను చిరంజీవి అభిమానినని, ఆయన సినిమాలను క్రమం తప్పకుండా చూస్తానని ఆమె చెప్పారు. అనంతరం ఆనంద్ అక్కడి నుంచే చిరంజీవికి ఫోన్ చేసి విషయం చెప్పారు. వీలు చూసుకుని రెండుమూడు రోజుల్లో ఆసుపత్రికి వస్తానని చెప్పడంతో ఆ విషయాన్ని ఆనంద్ సూపరింటెండెంట్ డాక్టర్ రాజారావుకు చెప్పారు.

యాదాద్రి జిల్లా తిరుమలాపురం గ్రామానికి చెందిన సత్తెమ్మ(60)కు మెదడులోని 'మోటర్ కార్టెక్స్' ప్రాంతంలో కణితి ఏర్పడింది. సాధారణంగా మోటర్ కార్టెక్స్ భాగంలో కాళ్లు, చేతులకు సంబంధించిన నరాలు ఉంటాయని, ఆ భాగంలో ఆపరేషన్ చేసినప్పుడు కాళ్లు,చేతులు పడిపోయి పక్షవాతం వచ్చే అవకాశాలు ఉండడం వల్ల రోగిని స్పృహలో ఉంచే ఆపరేషన్ చేస్తామని గాంధీ దవాఖాన సర్జికల్ న్యూరో విభాగాధిపతి డాక్టర్ శ్రీనివాస్ వివరించారు. సత్తెమ్మ మెదడు పైపొరలు, చర్మానికి మాత్రమే అనస్తీషియా ఇచ్చి, రోగిని స్పృహలో ఉంచే ఆపరేషన్ చేశామని వివరించారు. రోగికి అడవి దొంగ సినిమా చూపిస్తూ, మాటల్లో పెట్టి అతిజాగ్రత్తగా నరాలకు ఎలాంటి హాని కలగకుండా డాక్టర్ ప్రకాశ్‌రావు తన బృందంతో కలిసి శస్త్రచికిత్స నిర్వహించినట్లు తెలిపారు. ఆపరేషన్‌లో డాక్టర్ నాగరాజు, అనస్తీషియా వైద్యులు డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ సారయ్య, డా.ప్రతీక్ష, డా.అబ్బయ్య పాల్గొన్నారు.

# చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే సండ్ర



ఖమ్మం,ఆగష్టు 27: (నేటినిజం ప్రతినిధి): పేదింటి ఆడబిడ్డల పెళ్లి కానుకగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పెళ్ళికానుకగా తన వంతు చీరను ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య, తల్లాడ మండలం అన్నారుగూడెం గ్రామంలో లబ్ధిదారులకు నేరుగా వారి గ్రామాలకు వెళ్లి పంపిణీ చేశారు. అదేవిధంగా వృద్ధాప్యంతో ఉన్న వారికి రాష్ట్ర ప్రభుత్వం ఆసరాగా అందించే 57 ఏళ్ల వృద్ధాప్య ఆసరా పింఛన్లను, ఒంటరి మహిళలకు వితంతు పింఛన్లను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా మంజూరు చేయగా లబ్ధిదారులకు వారి గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పింఛన్ కార్డులను అందజేసి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వారికి అండగా నిలిచిందని వారికి భరోసాని కల్పించారు. అనారోగ్యానికి గురై కార్పొరేట్ హాస్పిటల్లో సైతం వైద్యం చేయించుకున్న వారికి చేయూతగా ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య సిఫార్సు మేరకు మంజూరైన గ్రామానికి చెందిన లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ నుండి మంజూరు అయిన చెక్కులను వారికి అందజేశారు.

# చక్రం ఊడి బ్రిడ్జి పైనుంచి నదిలో పడ్డ ట్రాక్టర్.. 10 మందికిపైగా రైతులు గల్లంతు

హర్దోయ్, ఆగష్టు 27: ఉత్తరప్రదేశ్ రాష్ట్రం హర్దోయ్ జిల్లాలో ఘోరం జరిగింది. ఇరవై మందికి పైగా రైతులతో వెళ్తున్న ట్రాక్టర్ చక్రం ఊడిపోవడంతో అదుపుతప్పి నదిలో పడింది. ప్రమాదం జరిగిన వెంటనే 13 మంది రైతులు ఈదుకుంటూ ఒడ్డుకు చేరారు. మరో పది మందికిపైగా రైతులు గల్లంతయ్యారు. పాలీ ఏరియాలో ఘర్రా నదిపైగల బ్రిడ్జి మీద ఈ ఘటన చోటుచేసుకుంది. చక్రం ఊడిపోగానే ట్రాక్టర్ అదుపుతప్పి బ్రిడ్జి రెయిలింగ్‌ను ఢీకొట్టి నదిలో పడిపోయిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా ప్రాంతానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గ్రామస్తులతో కలిసి గల్లంతైన వారి కోసం గాలిస్తున్నారు.

సమీపంలోని పట్టణంలో దోసకాయలు అమ్ముకుని తిరిగి ఇళ్లకు వెళ్తుండగా ప్రమాదం జరిగిందని ప్రమాదం నుంచి బయటపడిన వాళ్లు తెలిపారు.

ట్రాక్టర్ నదిలో పడిపోయిన విషయం తెలిసి గల్లంతైన వారి కుటుంబసభ్యులు, బంధువులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. వారి అరుపులు, రోదనలతో ఘటనా ప్రాంతంలో పరిస్థితి బీతావహంగా మారింది. గల్లంతైన వారి కోసం అధికారులు గజ ఈతగాళ్లను రప్పించి గాలింపు చర్యలు చేపట్టారు.

# గణేష్ ఉత్సవాలకు అనుమతి తప్పనిసరి : ఎస్ ఐ పొదిల వెంకన్న



ఖమ్మం,ఆగష్టు 27: (నేటినిజం ప్రతినిధి): చింతకాని మండలంలోని ప్రజలు వినాయక చవితి ఉత్సవాలు ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని చింతకాని ఎస్.ఐ పొదిల వెంకన్న ఆకాంక్షించారు. గ్రామాల్లో మండపాలు, పందిళ్ళు, ఏర్పాటు కోసం పోలీస్ స్టేషన్లో అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్.ఐ తెలిపారు. ఈ నెల 31న వినాయక చవితి సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు వినాయక మండపాలు ఏర్పాటు చేసేవారు ఉత్సవ కమిటీ ఏర్పాటు చేసుకొని స్థానిక పోలీస్ స్టేషన్లో అనుమతులు పొందాలని ఎస్సై శనివారం ప్రకటనలో తెలిపారు. ముఖ్యంగా విగ్రహ ఏర్పాటుదారులు అధికారులు నిర్దేశించిన నిబంధనల మేరకు నడుచుకొని వినాయక చవితిని జరుపుకోవాలని ఆయన సూచించారు. వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసే మండపాలలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విగ్రహ ప్రతిష్ట నాటి నుండి ఎన్ని రోజులపాటు పూజలు జరుపుతున్నారో, నిమజ్జన కార్యక్రమం ఎప్పుడు ఎక్కడ నిర్వహిస్తారో వాటికి సంబంధించిన వివరాలు పోలీసు వారికి తెలియజేయాలని ఆయన కోరారు. మండల ప్రజలు శాంతిభద్రతలకు సహకరించాలని, నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా విగ్రహాలు ఏర్పాటు చేస్తే వారిపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

# సెప్టెంబర్ 1 న సాంస్కృతిక కళా సంస్థల కళాకారుల సమావేశం



రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 27: (నేటినిజం ప్రతినిధి): వేములవాడ నృత్యకళా నికేతన్ సేవా సంస్థ ప్రధాన కార్యాలయం సాంస్కృతిక కళా సంస్థల కళాకారుల శనివారం సమావేశం. జరిగినది. సంస్థ అధ్యక్షులు గంగ శ్రీకాంత్ అధ్యక్షతన. ప్రధాన కార్యదర్శి. మానువాడ లక్ష్మీనారాయణ స్వాగత వచనములు తో ప్రారంభము అయినది. కళాకారుల చే పాటలు కళా ప్రదర్శన నిర్వహించారు. అనంతరం వ్యవస్థాపక అధ్యక్షులు ఎల్ల పోచెట్టి మాట్లాడుతూ సెప్టెంబర్ 1 వ తేదీన మధ్యాహ్నం 2 గ నీ.లకు జిల్లా గ్రంథాలయ సంస్థ. నందు జరుగు జిల్లా కళాకారులు సమావేశం నికి జిల్లా లోని సాస్కృతిక కళా సంస్థల అధ్యక్ష కార్యదర్శులు అన్ని రకాల కళాకారులు పాల్గొన విజయవంతం చేయాలని కోరారు .ఈ సమావేశంలో నూతనంగా జిల్లా సాంస్కృతిక కళా సంస్థల సమాఖ్య.. తెలంగాణ రాష్ట్రం బ్యానర్ ఆవిష్క రించ బడును.

జిల్లా అడ హక్ కమిటి మరియు మండల కన్వీనర్ ల ఎన్నిక జరుగును కావున కళాకారులు అందరూ పాల్గొన్నా లో అని కోరినారు. మహా భారత కళా సంస్థ జిల్లా అధ్యక్షులు బొడ్డు రాములు మాట్లాడుతూ మన జిల్లా లోని కళాకారులు అందరము కలిసి కళను ముందుకు తీసుకు పోవాలని కొరినారు.. ఈ సమావేశం కళాకారులు వారాల దేవయ్య వైఎస్ శర్మ వ్యవస్థాపకులు ఉమ్మడి కరీం నగర్ జిల్లా సాంస్కృతిక కళా సమాఖ్య.. బుర్రి. శంకరయ్య. గజ్జెల సాయిలు. తుము ముకుందం. పత్తిపాక మల్లయ్య. దొంగారి లక్ష్మీరా జం ధర్మపురి. లస్మయ్య. గరిగంటి చంద్రయ్య. శావన పెల్లి. శ్రీనివాస్. కల్లెడ నర్సయ్య కాసరపు లక్ష్మణ్. యెగ్గరి. సత్యనారాయణ రావు. బెంద్రం తిరుపతి రెడ్డి తదితులు కళా కారులు పాల్గొన్నారు

# ఏపీ సీఎం జగన్ కు హైకోర్టులో ఊరట

అమరావతి, ఆగష్టు 27: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి హైకోర్టులో ఊరట లభించింది. సీబీఐ కోర్టుకు వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు విషయంలో జగన్ కు ఊరట కలిగింది. సీబీఐ కోర్టు ఉత్తర్వులను హైకోర్టు రద్దు చేసింది. తనకు బదులు న్యాయవాది హాజరవుతారని జగన్ తెలిపారు. జగన్ అభ్యర్థనను హైకోర్టు అంగీకరించింది. సీబీఐ కోర్టు తప్పనిసరని భావించినప్పుడు వ్యక్తిగతంగా హాజరుకావాలని హైకోర్టు సీఎం జగన్ కు ఆదేశించింది.



# అన్నపూర్ణ ఆలయంలో..బ్రహ్మోత్సవాలు

హైదరాబాద్, ఆగష్టు 27: అన్నపూర్ణ ఆలయం 23వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు, ప్రత్యేక పూజలు మూడు రోజుల పాటు కన్నుల పండువగా సాగాయి. చివరి రోజు బుధవారం శివపార్వతుల కల్యాణం వేలాది మంది భక్తుల మధ్య కోలాహలంగా వేద పండితుల మంత్రోచ్చరణలతో నిర్వహించారు. అనంతరం తీర్థ, ప్రసాదాలతో పాటు అన్న ప్రసాత వితరణ ఆలయ కమిటీ నిర్వాహకులు ఏ ర్పాటు చేశారు.

ఈ పూజా కార్యక్రమాలలో తెలంగాణ ప్రభుత్వ విప్ ఎం.ఎస్. ప్రభాకర్ రావు, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్ రావు, మాజీ ఎమ్మెల్సీ కా సాని జ్ఞానేశ్వర్, మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్ చందర్ జీ, జాతీయ ఎస్సీ కమిషన్ మాజీ సభ్యుడు కె. రాములు, కార్పొరేటర్లు దేవర కరుణాకర్, బోయిని దర్శన్, మాజీ కార్పొరేటర్ బంగారి ప్రకాశ్, జీవన్ సింగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ బండారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో అతిథులను సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ ప్రతినిధులు బండారి పొందు, సత్యనారాయణ, కృష్ణ, నర్సింహ, వెంకటేశ్, నాగరాజ్, ధన్‌రాజ్, గణేశ్, సందీప్, సాయి పాల్గొన్నారు.

# కుటుంబ సమేతంగా రాజన్న దర్శించుకున్న హై కోర్ట్ జస్టిస్ ఏ.సంతోష్ రెడ్డి



రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 27: (నేటినిజం ప్రతినిధి): హైకోర్టు జస్టిస్ సంతోష్ రెడ్డి దంపతులను ఆలయ సంప్రదాయం ప్రకారంగా పూర్ణకుంభ స్వాగతం పలికిన అనంతరం శ్రీ రాజరాజేశ్వర స్వామివారి ని దర్శించుకొని ప్రత్యేక పూజలునిర్వహించారు. స్వామి వారి కళ్యాణమండపం లో హైకోర్టు జస్టీస్ దంపతులకు వేదోక్త ఆశీర్వచినం చేసిన అనంతరం ఆలయ ఏ ఈఓ లు బి.శ్రీనివాస్, నవీన్ లు శేషవస్త్రం అందజేసి లడ్డు ప్రసాదం స్వామి వారి చిత్ర పటం అందజేసినారు.వీరి వెంట జిల్లా జడ్జి ,అడిషనల్ కలెక్టర్ ,స్థానిక మేజిస్ట్రేట్ తో పాటుగా డిఎస్పీ ,సిఐ ఉన్నారు.

# టిటికె ప్రెస్టీజ్ కప్రస్ నాన్-స్టిక్ కుక్‌వేర్ మార్కెట్లోకి



హైదరాబాద్, ఆగష్టు 27: భారతీయుల ఆరోగ్యానికి ప్రాధాన్యతఅందించే సిల్వర్ అయాన్ టెక్నాలజీతో కూడిన భారతదేశం యొక్క ఏకైక వంటసామాను- హానికరమైన రసాయనాలు లేకుండా పిఎఫ్ ఓ ఎలేని నాన్‌స్టిక్ కుక్‌వేర్ మార్కెట్లోకి విడుదల అంతర్గతంగా మూడు సాంకేతికతతో కూడిన సాంకేతికత నాన్-స్టిక్ రిలీజ్ ప్రాపర్టీల కారణంగా చమురు- రాపిడి-నిరోధక పూతతో అధిక మన్నికను అందిస్తుందని సంస్థ నిర్వాహకులు విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలను అందించే సిల్వర్ అయాన్ టెక్నాలజీతో భారతదేశం యొక్క ఏకైక వంటసామాను, కుప్రస్ వర్గంలో గేమ్-ఛేంజర్. కొత్తగా ప్రారంభించిన శ్రేణి ఆరోగ్యకరమైన వంట కోసం రాగి కణాలతో బలోపేతం చేయబడింది. ఒక అదనపు ప్రయోజనం ఏమిటంటే, అత్యుత్తమ నాన్-స్టిక్ విడుదల లక్షణాలు ఇంట్లో వంట చేసేవారు వంట ప్రక్రియలో తక్కువ నూనెను ఉపయోగించడంలో సహాయపడతాయి. కుప్రస్ శ్రేణి ప్రత్యేకమైన పూతతో వస్తుంది, ఇది మ్యాట్రిక్స్ సాంకేతికతను ఉపయోగించి బలోపేతం చేయబడిందని అన్నారు. ఇది వంటసామాను రాపిడికి నిరోధకంగా మరియు మన్నికైనదిగా చేస్తుంది, తద్వారా సంవత్సరాలపాటు కొనసాగుతుంది. పూత కూడా వంటసామాను ఏకరీతి ఉష్ణ బదిలీని అందజేస్తుందని నిర్ధారిస్తుంది మరియు ఉత్తమ వంట అనుభవం కోసం ఉన్నతమైన నాన్-స్టిక్ విడుదలను అందిస్తుంది. కుప్రస్ శ్రేణి పిఎఫ్ ఒఎ పూతతో వస్తుంది, ఇది హోమ్-కుక్ ఆరోగ్యకరమైన పద్ధతిలో ఉడికించడానికి అనుమతిస్తుంది. కుప్రస్ నాన్-స్టిక్ కుక్‌వేర్ రేంజ్ రేజ్ సౌలభ్యం కోసం నిర్మించబడింది. స్టెయిన్‌లెస్-స్టీల్ హ్యాండిల్స్ సులభమైన నిర్వహణ సామర్థ్యాన్ని నిర్ధారిస్తాయి. వంటసామాను ఇండక్షన్ ఉ గ్యాస్ స్టవ్‌లు రెండింటిలోనూ ఉ పయోగించవచ్చు. ఇది డిష్‌వాషర్‌కు అనుకూలమైనది. ఈ శ్రేణిలో సాస్‌పాన్‌లు మరియు కడైస్‌లు ఉంటాయి, ఇవి ఆవిరి గుంటలతో కూడిన గాజు మూతతో వస్తాయి. ఈ శ్రేణిలో ఫ్రైయింగ్ ప్యాన్‌లు మరియు తవాలు కూడా ఉన్నాయి. ప్రెస్టీజ్ ఎక్స్‌క్లూజివ్ స్టోర్‌లు, ఎంపిక చేసిన డీలర్ అవుట్‌లెట్‌లు, బ్రాండ్ యొక్క ప్రత్యేకమైన ఇ-స్టోర్ బఫ్రనీజూ.బిబిఎజూతీవబబితిణవ.ఇనీఎ మరియు ఇతర ప్రముఖ ఈకామర్స్ సైట్‌లలో వంటసామాను శ్రేణి కొనుగోలు చేయడానికి అందుబాటులో ఉందని నిర్వాహకులు తెలిపారు.

# వినాయక నవరాత్రి ఏర్పాట్లకు చర్యలు

## -వినాయక నవరాత్రి ఏర్పాట్లకు చర్యలు
## సమీక్షా సమావేశంలో మేడ్చల్ కలెక్టర్ హరీశ్




మేడ్చల్, ఆగష్టు 27: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా వినాయక నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా అధికారులు అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకోవాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ హరీశ్ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం అధికారులతో కలెక్టర్ హరీశ్ సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ, ఈ నెల 31 నుంచి వచ్చే నెల 31 వరకు జరిగే గణేశ్ నవరాత్రి ఉత్సవాలకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లను చేస్తున్నదన్నారు.

మే డ్చల్ జిల్లా వ్యాప్తంగా 17 చెరువులలో నిమజ్జనాలు జరుగనున్నట్లు, అందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ అన్నారు. వినాయకుల ను నిమజ్జనం చేసే చెరువుల వద్ద గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచే విధం గా మత్స్యశాఖ అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. 17 చెరువుల వద్ద క్రేన్లను ఉంచాలని సూచించారు. పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలన్నారు. ఈ సమీక్షలో జిల్లా అదనపు కలెక్టర్లు నర్సింహారెడ్డి, శ్యాంసన్, డీఆర్వో లింగ్యా నాయక్, బాలానగర్ డీసీపీ సందీప్, ఆర్డీవోలు మల్లయ్య, రవి మున్సిపల్ కమిషనర్లు, వివిధ మండలాల తహశీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే చెవిరెడ్డిని వరించిన ఏషియన్ రికార్డ్ బుక్ అవార్డు

తిరుపతి,ఆగష్టు 27: చంద్రగిరి ఎమ్మెల్యే, తుడా చైర్మన్ చెవిరెడ్డి భాస్కర రెడ్డిని ఏషియన్ రికార్డ్ బుక్ అవార్డు వరించింది. వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని మట్టి వినాయక ప్రతిమలను ప్రజలకు పంపిణీ చేయాలని సంకల్పించడం పట్ల ఈ సంస్థ హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు శనివారం తిరుపతిలో ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో ఏషియన్ రికార్డ్ బుక్ ప్రతినిధులు చెవిరెడ్డికి అవార్డును బహూకరించారు. చంద్రగిరి నియోజకవర్గంలోని ప్రతి ఇంటికి మట్టి వినాయక విగ్రహాన్ని అందించే కార్యక్రమాన్ని చెవిరెడ్డి ప్రారంభించారు. ఇందుకోసం భారీమొత్తం ఖర్చు పెట్టి వినాయకుడి మట్టి విగ్రహాలను తయారు చేయిస్తున్నారు.

పర్యావరణహితంగా మట్టి వినాయక ప్రతిమలను 1.24 లక్షల విగ్రహాలను పంపిణీ చేయాలని ఎమ్మెల్యే చెవిరెడ్డి చేస్తున్న ప్రయత్నానికి ప్రోత్సాహకరంగా ఏషియన్ రికార్డ్ బుక్ తమ అవార్డుకు ఎంపికచేసింది. తన నియోజకవర్గంలోని ప్రతి ఇంటికీ విగ్రహాన్ని అందజేసేందుకు ఎమ్మెల్యే చెవిరెడ్డి విగ్రహాల తయారీకి పూనుకున్నారు. విగ్రహాలను ఎమ్మెల్యే బృందం త్వరలోనే నియోజకవర్గంలో పంపిణీ చేయనున్నది. చెవిరెడ్డికి ఏషియన్ రికార్డ్ బుక్ అవార్డు రావడం పట్ల ఆయన అనుచరులు, బంధుమిత్రులు, వైసీపీ నేతలు హర్షం వ్యక్తం చేశారు. పర్యావరణహిత వినాయక వినాయక విగ్రహాలను తుడా చైర్మన్, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పెద్దఎత్తున ప్రచారం చేయడం పట్ల తిరుపతి వరసిద్ధి వినాయక మహోత్సవ కమిటీ (టీవీవీఎంసీ) నాయకులు ప్రశంసలు కురిపించారు. తిరుపతి నగరంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో చెవిరెడ్డి ఏర్పాటు చేసిన మట్టి విగ్రహాల తయారీ కేంద్రాన్ని కమిటీ నాయకులు జీ భానుప్రకాష్‌రెడ్డి, సామంచి శ్రీనివాస్, గుండాల గోపీనాథ్ తదితరులు సందర్శించి అభినందించారు. ఈ సందర్భంగా చెవిరెడ్డిని ఏషియన్ రికార్డ్ బుక్ అవార్డు రావడం సముచితమని కొనియాడారు.

# పిల్లాల చదువులపై తల్లిదండ్రులు దృష్టి పెట్టాలి:హెచ్ ఎం మిట్టపల్లి




రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 27: (నేటినిజం ప్రతినిధి): విద్యనభ్యాసి స్తున్నా పిల్లాలపై వారి తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ప్రధానోపా ధ్యాయులు మిట్ట పల్లి పరుశరాములు కోరారు. శనివారం బోయిన్ పల్లి మండలం విలాసాగర్ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల లో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం జరిగింది .ఈ సమావేశంలో విద్యార్థులు చదువుతున్న ,పాఠశాలాలో మసులు కుంటున్నా తీరును వివిధ సబ్జెక్టు ఉపాధ్యాయులు వారి తల్లిదండ్రులకు వివరించారు .ఈ సందర్భంగా హెచ్ఎం పరుశరాములు మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాల నుండి ఇంటికి వచ్చిన తరువాత ఉ పాధ్యాయులు ఏ పాఠ్యాంశములో ఏ సెలబస్ బోధించారో విద్యార్థుల తల్లిదండ్రులు తెలుసుకొని విద్యార్థులు ఇంట్లో చదివే విధంగా చూసుకున్నాట్లయితే వారిలో చదువు సక్రమంగా రావడంతో పాటు క్రమశిక్షణ తో కూడిన వివిధ లక్షణాలు అలవర్చుకుంటారని హెచ్ ఎం అన్నారు. ఈసమావేశంలో సీనియర్ ఉపాధ్యాయులు మాదిరెడ్డి రాజిరెడ్డి ,తదితరులు పాల్గొన్నారు.

# ఆజాద్ కొత్త పార్టీ 14 రోజుల్లో ఏర్పాటు

హైదరాబాద్, ఆగష్టు 27: కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన సీనియర్ నాయకుడు గులాం నబీ ఆజాద్.. 14 రోజుల్లో కొత్త పార్టీ పెట్టబోతున్నారు. ఈ విషయాన్ని ఆజాద్ సన్నిహితుడు, జమ్ముకశ్మీర్ మాజీ మంత్రి జీఎం సరూరీ వెల్లడించారు. జమ్ముకశ్మీర్‌లో 2019, ఆగస్టు 5వ తేదీకి ముందున్న స్థితిని పునరుద్ధరించాలనే అంశాన్ని తమ పార్టీ మ్యానిఫెస్టోలో చేరుస్తామని ఆయన తెలిపారు.

గులాం నబీ ఆజాద్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన వెంటనే ఆయనకు మద్దతుగా సరూరీ కూడా రాజీనామా చేశారు. ఆయనతోపాటు జమ్ముకశ్మీర్‌కు చెందిన చాలా మంది నాయకులు కాంగ్రెస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వాన్ని కూడా వదులుకున్నారు. వీళ్లేగాక వందల సంఖ్యలో కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు కూడా కాంగ్రెస్ పార్టీని వీడారు.

ఆజాద్ బీజేపీలో చేరుతాడన్న వార్తలను సరూరీ కొట్టిపారేశారు. తమ నాయకుడు సిద్ధాంతాలపరంగా లౌకికవాది అని, ఆయన బీజేపీ పక్కన చేరే అవకాశమే లేదని చెప్పారు. సెప్టెంబర్ 4న ఆజాద్ జమ్ముకశ్మీర్‌కు వస్తున్నారని, అదేరోజు పార్టీ ఏర్పాటుపై స్థానిక నేతలతో చర్చించనున్నారని తెలిపారు. ముందుగా రాష్ట్రస్థాయిలో పార్టీని ఏర్పాటు చేస్తామని, ఆ తర్వాత జాతీయ పార్టీ విషయాన్ని పరిశీలిస్తామని సరూరీ పేర్కొన్నారు.

# గంటకు 180 కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్లిన వందేభారత్ రైలు..

న్యూఢిల్లీ, ఆగష్టు 27: వందేభారత్ రైలు రికార్డు క్రియేట్ చేసింది. ట్రయల్ రన్‌లో ఆ రైలు గంటకు 180 కిలోమీటర్ల వేగంతో దూసుకువెళ్లింది. శుక్రవారం టెస్ట్ రన్ నిర్వహించారు. ఈ విషయాన్ని రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తన ట్విట్టర్‌లో తెలిపారు. కోటా-నాగ్దా సెక్షన్ మధ్య రైలు వేగాన్ని పరీక్షించారు. టెస్ట్ రన్ నిర్వహిస్తున్న సమయంలో రైలులో వాషింగ్, క్లీనింగ్‌తో పాటు అన్ని పరికరాల పనితీరును పరిశీలించినట్లు ఆయన వెల్లడించారు. కోటా-నాగ్దా రూట్లో రైలు స్పీడ్ లెవల్స్‌ను టెస్ట్ చేసినట్లు మంత్రి తెలిపారు. 16 కోచ్‌లతో వందేభారత్ రైలును పరీక్షించారు.

కోటా డివిజన్‌లో వివిధ దశల్లో ట్రయల్స్ చేపట్టారు. కోటా నుంచి ఘాట్ కా బరానా మధ్య మొదటి దశ ట్రయల్, ఘాట్ కా బరానా నుంచి కోటా మధ్య రెండో దశ ట్రయల్, కుర్లాసీ నుంచి రామ్‌గంజ్ మధ్య మూడవ దశ ట్రయల్, నాలుగవ-అయిదవ దశ ట్రయల్ కూడా ఈ స్టేషన్ల మధ్య డౌన్‌లైన్‌లో చేపట్టారు. ట్రయల్ రన్ నిర్వహిస్తున్న సమయంలో అనేక ప్రదేశాల్లో రైలు గంటకు 180 కిలోమీటర్ల వేగాన్ని టచ్ చేసినట్లు మంత్రి తెలిపారు. వందేభారత్ రైలును పూర్తిగా ఇండియాలోనే తయారీ చేస్తున్నారు. దీన్ని సెమీ హై స్పీడ్ ట్రైన్‌గా పిలుస్తున్నారు. వందేభారత్‌కు ప్రత్యేక ఇంజిన్ ఉండదు.

# పద్మకాలనీ పార్కు అభివృద్ధికి చర్యలు

హైదరాబాద్, ఆగష్టు 27: అడిక్‌మెట్ డివిజన్ పద్మకాలనీ పార్కును సుందరంగా తీర్చిదిద్దనున్నట్లు ఎమ్మెల్యే ముఠా గోపాల్ తెలిపారు. ఆయన ఉద్యానవన శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీదేవితో కలిసి పద్మకాలనీ పార్కును సందర్శించారు. పార్కు అభివృద్ధికి చేపట్టవలసిన చర్యలపై చర్చించిన వెంటనే పనులు ప్రారంభించాల్సింది సూచించారు.

స్థానికుల ఉపయుక్తంగా ఉండేలా గ్రీనరీ ఏర్పాటు చేయడంతోపాటు ఫుట్‌పాత్, వ్యాయామ విభాగం వంటి సదుపాయాలు కల్పించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని పలు పార్కులను ఇప్పటికే సుందరంగా తీర్చిదిద్దడం జరిగిందని, త్వరలో మరిన్ని పార్కుల్లో సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ పార్టీ నాయకులు ముఠా జయసింహ, ముచ్చుకుర్తి ప్రభాకర్, దీన్‌దయాల్‌రెడ్డి పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ..

ముషీరాబాద్ డివిజన్‌కు చెందిన పలువురు లబ్ధిదారులకు ఎమ్మెల్యే ముఠా గోపాల్ సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. ముషీరాబాద్ డివిజన్ టీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఐదుగురు లబ్ధిదారులకు 1.58 లక్షల రూపాలయ చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు కాడబోయిన నర్సింగ్‌ప్రసాద్, ఆకుల అరుణ్, శ్రీధర్‌రెడ్డి, ఎయిర్‌టెల్ రాజు, శివముదిరాజ్, పూస గోరఖ్‌నాథ్, గోవింద్, శ్రీకాంత్ గౌడ్, ఉమారాణి, శోభ, సదా తదితరులు పాల్గొన్నారు.

# 28న పోలీస్ కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్ష

హైదరాబాద్, ఆగష్టు 27: : పోలీస్ కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్షా కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేశామని, పరీక్ష రాసేందుకు వచ్చే వారు నియమ నిబంధనలు పాటించాలని రాచకొండ పోలీస్ కమిషనర్ మహేశ్‌భగవత్ సూచించారు. బుధవారం నాగోల్‌లోని నిమంత్రన్ ప్యాలెస్ ఫంక్షన్ హాల్‌లో రిజినల్ కోఆర్డినేటర్స్, నోడల్ ఆఫీసర్స్, సూపరింటెండెంట్స్, అబ్జర్వర్స్, ఇన్విజిలేటర్స్, పరీక్ష కేంద్రాలకు సంబంధించిన విద్యాసంస్థల ప్రతినిధులతో ఈ నెల 28న జరిగే కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్షకు సంబంధించి సమన్వయ సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశంలో సీపీ మాట్లాడుతూ పరీక్షా కేంద్రాల వద్ద పూర్తిస్థాయి సిబ్బందిని నియమించి పటిష్ట బందోబస్తు నిర్వహించాలన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పరీక్షకు హాజరయ్యే వారు హాల్ టికెట్ మినహా ఎలాంటి గుర్తింపు కార్డు తీసుకురావాల్సిన అవసరం లేదని, బయోమెట్రిక్ విధానంతో అభ్యర్థుల వెరిఫికేషన్ ఉంటుందని తెలిపారు. వేలాది మంది అభ్యర్థులు పరీక్షకు హాజరవుతారని, పరీక్ష కేంద్రాల వద్ద తగిన ఏర్పాట్లు చేయాలని సిబ్బందికి సూచించారు. అభ్యర్థులు పరీక్ష రోజు వరకు కష్టపడి చదవాలని తెలిపారు. ఈ సమావేశంలో డీసీపీ శ్రీబాల, అదనపు డీసీపీలు లక్ష్మీనారాయణ, నర్మద, శ్రీనివాస్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# ఇతర పార్టీల సర్కార్లను కూల్చేందుకు రూ . 6300 కోట్లు ఖర్చు : బీజేపీపై కేజ్రీవాల్ ఫైర్

న్యూఢిల్లీ, ఆగష్టు 27: ఇతర పార్టీల ప్రభుత్వాలను కూల్చేందుకు కాషాయ పార్టీ రూ 6300 కోట్లు వెచ్చించకుంటే ఆహారోత్పత్తుల మీద జీఎస్టీ విధించాల్సిన అవసరం ఉండేది కాదని ఢిల్లీ సీఎం, ఆప్ జాతీయ సమన్వయకర్త అరవింద్ కేజ్రీవాల్ వ్యాఖ్యానించారు. ఇప్పటివరకూ ప్రభుత్వాలను కూల్చేందుకు బీజేపీ రూ 6300 కోట్లు ఖర్చు చేసిందని దుయ్యబట్టారు.

ఇంత మొత్తం ఖర్చు చేయనిపక్షంలో గోధుమలు, బియ్యం, మజ్జిగ వంటి వాటిపై జీఎస్టీ విధించాల్సిన అవసరం ఉండేది కాదని కేజ్రీవాల్ కేంద్రం తీరును తప్పుపట్టారు. ప్రజలు ద్రవ్యోల్బణంతో ఇబ్బంది పడేవారు కాదని ఆయన ట్వీట్ చేశారు. అసెంబ్లీ సమావేశాల్లో బీజేపీని ఇతర పార్టీల సర్కార్లను కూల్చే సీరియల్ కిల్లర్‌గా అభివర్ణించిన అనంతరం ఈ వ్యాఖ్యలు చేశారు.

బీజేపీ ఇప్పటివరకూ గోవా, కర్నాటక, మహారాష్ట్ర, అసోం, మధ్యప్రదేశ్, అరుణాచల్‌ప్రదేశ్, మణిపూర్, మేఘాలయ సర్కార్లను కూలగొట్టిందని అన్నారు. ప్రజలు ఓ ప్రభుత్వాన్ని ఎన్నుకుంటే కాషాయ నేతలు వాటిని కూలదోస్తున్నారని మండిపడ్డారు. ఢిల్లీలో ఆప్ సర్కార్‌ను పడగొట్టేందుకు ఒక్కో ఎమ్మెల్యేలకు బీజేపీ రూ 20 కోట్లు ఆఫర్ చేస్తోందని అంతకుముందు కేజ్రీవాల్ ఆరోపించిన సంగతి తెలిసిందే.

# ప్రజా సంగ్రామ యాత్రకు తరలివెల్లిన 24 వార్డు బీజేపీ శ్రేణులు




రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 27: (నేటినిజం ప్రతినిధి) రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలోని 24 వవార్డు ప్రజా సంగ్రామ యాత్రకు తరలివెల్లిన బీజేపీ , బీజేవైఎం తరలి వెళ్లారు . భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కరీంనగర్ ఎమ్ పి బండి సంజయ్ కుమార్ చేపట్టిన మూడవ దశ ప్రజా సంగ్రామ యాత్ర ముగింపు సందర్భంగా శనివారం రోజున హనుమకొండ ఆర్ట్స్ కళాశాల గ్రౌండ్ లో జరిగే భారీ బహిరంగ సభకు భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షులు జె . పి . నడ్డా విచ్చేస్తున్న సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ నాయకత్వంలో బిజెపి సీనియర్ నాయకుడు అన్నారం శ్రీనివాస్ ఆధ్వర్యంలో నాయకులు , కార్యకర్తలు భారీ సంఖ్యలో సభకు బయలుదేరి వెళ్లారు .




# త్వరలోనే 2వ విడత గొర్రెల పంపిణీ

హైదరాబాద్, ఆగష్టు 27: రెండవ విడత గొర్రెల పంపిణీకి పశుసంవర్ధక శాఖ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో రెండవ విడతలో 1280 మంది లబ్ధిదారులకు గొర్రెల యూనిట్లను పంపిణీ చేయనున్నారు.

మొదటి విడతలో 3866 మంది లబ్ధిదారులకు గొర్రెల యూనిట్లను అందజేయగా, రెండవ విడతలో 1280 మంది లబ్ధిదారులకు అందజేయనున్నారు. లబ్ధిదారులు రూ.43,750 డీడీల ద్వారా పశు సంవర్ధక శాఖకు చెల్లించగా ప్రభుత్వం 75శాతం సబ్సిడీపై 1లక్షా 75 వేల విలువ గల 20 గొర్రెలు, ఒక మేకపోతు ఉన్న యూనిట్‌ను అందజేస్తున్నారు.

## గొర్రెలకు బీమా పరిహార పథకం అమలు

గొర్రెల యూనిట్లు పొందిన లబ్ధిదారులు నష్టపోకుండా ఉండేలా బీమా పరిహారం పథకాన్ని వర్తింపజేస్తున్నారు. మొదటి విడతలో గొర్రెల పంపిణీలో చనిపోయిన గొర్రెలకు బీమా పరిహారాన్ని మంజూరు చేసి 1479 గొర్రెలను మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా తిరిగి ఇప్పించినట్లు అధికారులు పేర్కొన్నారు. త్వరలోనే మిగతా 582 గొర్రెలకు బీమా పరిహారం అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com